విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 31,డిసెంబర్ 2023

నాయకుల మెప్పుకోసం బలవంతపు బస్సు యాత్ర

▶అడుగడుగునా ట్రాఫిక్ అంతరాయాలు ▶అంగన్వాడీ వర్కర్స్ కు తప్పని ఇక్కట్లు

విశాలాంధ్ర - నంద్యాల రూరల్ : వైయస్సార్ పార్టీ ప్రభుత్వము 2024 ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలని ఉద్దేశంతో లీడర్ మెప్పుకోసం బలవంతపు బస్సు యాత్రఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి నేతృత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తలపెట్టిన సామాజిక సాధికారిక బస్సు యాత్ర శనివారం నంద్యాలకు చేరుకుంది. బస్సు యాత్ర సందర్భంగా నంద్యాల పట్టణంలో అడుగడుగున ట్రాఫిక్ అంతరాయాలు కలిగి గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు కాగా పట్టణానికి హాస్పిటల్స్ నిమిత్తము వచ్చినవారు మరియు ఎమర్జెన్సీగా వచ్చిన ప్రభుత్వ, ప్రైవేట్ అంబులెన్సు తీవ్ర అంతరం ఏర్పడిందనీ దీంతో నానా ఇబ్బందులు పడ్డారనీ విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే పట్టణంలో చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులు, అంగన్వాడి వర్కర్స్ కూడా తమ స్వగ్రామాలకు వెళ్లడానికి సమయానికి బస్సులు లేక అవస్థలు పడ్డామని ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా శిల్పా కుటుంబానికి నంద్యాల వైయస్సార్ పార్టీ టికెట్టు దక్కించుకునేందుకు ప్రధానంగా బస్సు యాత్ర విజయవంతం కోసం లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టిన పట్టణ ప్రజల నుంచి గుప్పు గుప్పుగా వ్యతిరేకమైన విమర్శలు వినిపిస్తున్నాయని స్థానిక పార్టీ నాయకులే చర్చించుకోవడం గమనర్హం

బస్సు యాత్ర కాదు బిమా బ్రతుకులు మార్చండి రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర చేసుకోవడం కాదు మా బ్రతుకులు మార్చండి అంటూ అంగన్వాడి కార్యకర్తలు విజ్ఞప్తి చేస్తున్నారు. గత 19 రోజుల నుంచి మా సమస్యలు పరిష్కరించి మా బ్రతుకులు మార్చండి అనే ఉద్దేశంతో నిరవధిక దీక్షలు చేస్తున్నాం. కానీ ఇంతవరకు ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం చాలా విడ్డూరంగా ఉందని వారు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా వేలాదిమందితో సామాజిక సాధికారిక బస్సు యాత్ర విజయవంతం అవడంతో రాజకీయ విశ్లేషకులు మేధావులు అభినందనలు తెలుపుతున్నారు.

రాష్ట్ర ఆర్థిక మంత్రి ఇల్లు ముట్టడి

విశాలాంధ్ర - డోన్ రూరల్ : ఏఐటీయూసీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇల్లు ముట్టడించి నిరసన తెలిపిన ట్లు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా కోకన్వీ నర్ జులేఖ ఎఐటీయుసి నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్ తెలిపారు. స్థానిక ఐసిడిఎస్ కార్యా లయం నుండి మంత్రి ఇంటి వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతూ 19 రోజులుగా అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు ఆందోళన నిర్వహిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం అన్నారు మంత్రి బొత్స సత్యనారాయణ అంగన్వాడీలను చులకనగా మాట్లాడటం సరైన పద్ధతి కాదని ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా మాట్లా డకపోతే అంగన్వాడీలు ఆందోళనలు ఉధృతం చేయవలసి వస్తుం దని తెలిపారు. కనీస వేతనం 26,000 ఇచ్చేంత వరకు పోరాడుతామని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిం చాలని వారు ప్రధానంగా డిమాండ్ చేశారు .వెట్టి చాకిరి చేయించుకుని వేతనాలు పెంచమంటే సాకులు చెప్పడం ఈ ప్రభుత్వానికి దక్కిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఎస్ కె రామమోహన్ సెక్టార్ లీడర్స్ సుగుణ స్వర్ణ మంగమ్మ జయలక్ష్మి సరస్వతి నాగేంద్రమ్మ నీరజ శ్రీదేవి అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం రద్దు

విశాలాంధ్ర - నంద్యాల రూరల్ : వచ్చే సంవత్సరం జనవరి 1వ తేదీ సోమ వారం నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంద్యాల పట్టణం కలెక్టరేట్ లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమం నూతన సంవత్సరము పురస్కరించుకొని సోమవారం జరగాల్సిన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఫిర్యాదులు సమర్పించేవారు గమనించాలనీ ఆయన కోరారు.

యువకుడి దారుణ హత్య

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని కూలూరు రస్తా సమీపంలో అస్లాం(22) అనే యువకుడిని వరుసకు బావమరిదైన చాగలమర్రికి చెందిన యువకుడు సుబహాన్ కత్తితో దారుణంగా పొడిచి హత్య చేసిన ఘటన శు క్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రమణయ్య తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన అస్లాం, సుబహాన్లు బావ బామర్దులు ఇద్దరూ కలసి మద్యం సేవించేవారని, అదే క్రమంలో మద్యం సేవించే సమయంలో ప్రతిసారీ సుబహాన్ తల్లి ప్రవర్తనపై అసభ్యంగా తిడుతూ ఉండడంతో కోపం పెంచుకున్నాడన్నారు. స్థానిక కూలూరు రస్తాలో ఓ స్నేహితుడి మేడపైన శు క్రవారం రాత్రి మద్యం సేవించేప్పుడు కూడా సుబహాన్ తల్లి గురించి అసభ్యంగా తిడుతుండడంతో కోపంతో తన జేబులో పెట్టుకుని వచ్చిన కూర గాయలు తరిగే కత్తితో అస్లాంను అతి దారుణంగా పొడిచి చంపాడని ఎస్సై వివరించారు. విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత నాయక్, ఎస్సై రమణయ్య ఘటనాస్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. పరిసరాలలో ఆనవాలను సేకరించారు. మృతుడి తల్లి నసిమూన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నామని ఎస్సై వివరించారు.

ప్రభుత్వ వేధింపులతో చచ్చిపోతున్నాం

ఉరి తాళ్లతో అంగన్వాడి కార్మికుల వినూత్న నిరసన

విశాలాంధ్ర - చాగలమర్రి : రాష్ట్ర ప్రభుత్వము అంగన్వాడీలకు అనేక యాప్ లు ప్రవేశపెట్టి పని ఒత్తిడికి గురి చేస్తోందని, ప్రభుత్వ వేధింపులతో చచ్చిపో తున్నామని చాగలమర్రి మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ ఎదుట దీక్షా శిబిరంలో శనివారం అంగన్వాడీ టీచర్లు, సహాయకులు, మెడకు ఉరి తాళ్ళు వేసుకొని మూకుమ్మడిగా వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ 19 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం చలించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం కార్మిక చట్ట ప్రకారం 26 వేల రూపాయలు వేతనాలు ఇవ్వాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.ప్రభుత్వం స్పందించే వరకు నిరవ ధిక సమ్మె ఆగదని హెచ్చరించారు. ఈ సమ్మెలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చంద్రకళ, హసానమ్మ, హసీనా, వహీదా, రహమత్,సుజాత,ఇందుమతి, సిఐటి యు నాయకురాలు సంజీవమ్మ,రజిని,నాగమణి,రామసుబ్బమ్మ,పద్మావతి, హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాలు గుర్రమ్మ, గౌరీ, మేరీ జ్యోతి,సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఆకు అలమలు తింటూ అంగన్వాడీల నిరసన

విశాలాంధ్ర - రుద్రవరం : రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలంటూ శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో సిబ్బంది ఆకు అలమలను తింటూ నిరసన తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకపోవడంతో సమ్మె 19వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలువురు అంగన్వాడి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించేం తవరకు తిండి తీర్థాలు మానుకొని సమ్మెను కొనసాగిస్తామన్నారు. సమ్మెలో పలువురు అంగన్వాడి నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు యువకుడు మృతి

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని రచ్చబండ వద్ద చాగలమర్రి పట్టణం భవాని నగర్ కు చెందిన అవివాహిత లక్ష్మణుడు (23) అనే యువకుడు ప్రమాదవశాత్తూ మోటార్ బైక్ మీద నుండి పడి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు భవాని నగర్ లో నివాసం ఉంటున్న లక్ష్మణుడు జీవనోపాధిలో భాగంగా వ్యాపార నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళుతూ రచ్చబండ వద్ద బైక్ మీద నుండి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. గాయపడ్డ లక్ష్మణుడిని 108 వాహనంలో చాగలమర్రిలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

శాంతి భద్రతలకు భంగం కలిగించోద్దు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : నూతన సంవత్సర వేడుకలను శాంతి పద్ధతులకు భంగం కలగకుండా ఆనందంగా జరుపుకోవాలని ఎస్ఐ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం పోలీస్ స్టేషన్ నందు అనే విలేకరులతో మాట్లాడు తూ 31వ తేదీ రాత్రి గుంపులుగా తిరగడము, ఒకే చోట గుంపులుగా ఉండడం చేయవద్దన్నారు. రోడ్లపై మద్యం తాగుతూ, తిరుగుతూ ఇతరులను ఇబ్బంది పెట్టవద్దని ముఖ్యంగా మహిళలను బాలికలపై కామెంట్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంటర్టైన్మెంట్ కార్యక్రమాలు రోడ్లపై, బహిరంగ ప్రదేశాలలో నిర్వహిస్తే చర్యలు తప్ప ఉన్నారు. రాత్రి వేళలో పోలీ సులు తనిఖీ చేస్తారని మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుపడితే చట్టపరమైన చర్యలు తప్పవు అన్నారు. కొత్త సంవత్సరం వేడుకలు ఎవరి జీవితాల్లో విషాదం నింపకూడదన్నారు. ఎక్కువ శబ్దాలు ఇచ్చే డీజే సౌండ్ లాంటివి వినియోగించిన బైక్ సైలెన్సర్ తీసి శబ్దాలు చేసిన చర్యలు తప్ప ఉన్నారు. శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.

అంగన్వాడీలు అంబేద్కర్ కు వినతి

విశాలాంధ్ర-పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యం లో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె శనివారానికి 19వ రోజు కొనసాగించారు. సమ్మె సందర్భంగా అంబేద్కర్ విగ్రహం దగ్గర నల్ల రిబ్బన్లతో కండ్లకు గంతలు కట్టుకొని అంబేద్కర్ గారికి వినతిపత్రం అందజేసి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై నినాదాలు చేశారు.తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ ఇచ్చిన హామీని అమలు చేయాలని ముఖ్యఅతిథిగా సిఐటియు మండల కార్యదర్శి కె.భాస్కర్,టిడిపి ఎస్సీ క్రిస్టియన్ సెల్ నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు దువ్వాడ భాస్కర్ హాజరై సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలు 19 రోజులుగా సమ్మె చేస్తున్న సమస్యలపై పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా దుర్మార్గంగా వ్యవహరిస్తూ అంగన్వాడీల సమస్యలు పట్టించుకోకపోవడం దుర్మార్గ చర్య అన్నారు. అంగన్వాడీలకు గ్రాడ్యుటి తోపాటు వేతనం పెంచాలని, అంగన్వాడి వర్కర్ చనిపోయిన వారి ఇంటిలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని, పేస్ వ్యాపు రద్దు చేయాలని లేనిపక్షంలో పిల్లలు, లబ్ధిదారులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.పాస్టర్ జాన్, అనిల్ కుమార్,సుందర్ రావు, సిఐటియు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల నాయకురాలు వెంకటమ్మ, మాబునిస, శ్యామల, మరియమ్మ,హైమావతి, సూర్య ప్రభావతి, అనసూయ,లక్ష్మీదేవి,ప్రభావతి,శివమ్మ, వెంకటమ్మ, భారతి,విద్యార్థి సంఘం నాయ కులు ప్రతాప్, అంగన్వాడీలు ఆయాలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిల్పా తప్పుడు ప్రచారాలు మానుకో

విశాలాంధ్ర - నంద్యాల : ఎమ్మెల్యే శిల్పా రవి తప్పుడు ప్రచారాలు మానుకోవాలని టీడీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ హితవు పలికారు. నంద్యాల పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నిర్వహించిన మీడియా సమావేశంలో తెలుగుదేశం పార్టీలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఇచ్చే ఆరు గ్యారెంటీలను బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో టీడీపీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ఆన్లైన్ ద్వారా ష్యూరిటీ బాండ్లు ప్రజలకు అందజేస్తుంటే, టిడిపి ప్రజలకు చేరువవుతుందన్న అక్కసుతో జీర్ణించుకోలేక నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి, కౌన్సిలర్లు వాలేంటర్స్ ద్వారా టీడీపీ వాళ్ళు వస్తే ఓటీపీ ఇవ్వొద్దంటూ ప్రజల మధ్య అపోహలుసృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ఈస్ట్ ఇండియా కంపెనీ అయిన శిల్పా రవి తప్పుడు ప్రచారాలు మానుకోవాలని, ఇక మూడు నెలలే సమయమే ఉందని శిల్పా కుటుంబానికి తగిన బుద్ధి చెప్పడానికి నంద్యాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు మిద్దె హుస్సేనీ, దస్తగిరి, టీడీపీ నాయకులు అహమ్మద్ హుస్సేన్, అనుపూరి ఈశ్వర్,దూదేకుల సంఘం యువజన విభాగం రాష్ట్ర కన్వీనర్ రాజేష్ (బుజ్జి) పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో వైసీపీ సత్తా చాటుదాం

- నంద్యాల్లో సామాజిక సాధికారత యాత్ర భారీ సభ
- పాల్గొన్న డిప్యూటీ సీఎంలు, ఎంపీ, ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర - నంద్యాల : రాబోయే 2024 ఎన్నికల్లో వైకాపా తిరిగి భారీ మెజారిటీతో రాష్ట్ర వ్యాప్తంగా గెలిచి సత్తా చాటుదామని, ఎన్ని పార్టీలు ఒకటైనా సింహం సింగల్ గానే వస్తుందని డిప్యూటీ సీఎంలు అంజాద్ బాషా, నారాయణ స్వామిలు పేర్కొన్నారు. నంద్యాల పట్టణం గాంధీచౌక్ లో సామాజిక సాధికార యాత్ర బహిరంగ సభలో మాజీమంత్రి శిల్పా మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, హఫీజ్ ఖాన్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ సలహాదారు హబిబుల్లా, ఏపీ మార్కెఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి,మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, ఏపీ ఎస్సీడీసీఎల్ డైరెక్టర్ డా. శశికళరెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అంజాద్ బాషా మాట్లాడుతూ సీఎం జగన్ తోనే రాష్ట్రంలో సామాజిక సాధికారత సాధ్యమని, బడుగు, బలహీనవర్గాలకు విద్య, సామాజిక, ఆర్థిక,రాజకీయ స్థాయిని జగనన్న పెంచారని పేర్కొన్నారు. నాడు నేడు, అమ్మ ఒడి, జగనన్న గోరు ముద్ద, విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ దీవెన వంటి అనేక పథకాలను అందించారని పేర్కొ న్నారు. మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి మాట్లాడుతూ కొందరు గల్లీ నాయ కులు తనపై అవాకులు,చెవాకులుపేలుతున్నారని, తనను ఊరు విడిపిస్తారని చెబుతున్నారని, వారు నోరు కొంచెం అదుపులో పెట్టుకోవాలని హెచ్చరిం చారు తాను కూడా ఫ్యాక్షన్ రాజకీయాలను చూశానని, శిల్పా అంటేనే ఒక నమ్మకమని, నంద్యాల ప్రజల అండదండలు ఉన్నంతవరకు తమను ఇంచు కూడా కదిలించలేరని సవాల్ విసిరారు. 29 సంవత్సరాలుగా శిల్పా కుటుంబం నంద్యాల ప్రజలకు రాజకీయాలకతీతంగా సేవలందిస్తుందని పేర్కొన్నారు. తిరిగి తన కుమారుడైన ఎమ్మెల్యే శిల్పా రవిని 2024 ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. మాజీ మంత్రి, నెల్లూరు ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ సీఎం జగన్ తోనే సామాజిక సాధికారత సాధ్యమవు తుందని, దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ,వాలంటీర్ వ్యవస్థ తెచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డిదే అని, సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదా రులకే అందించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. 2014 ఎన్నికల్లో మైనార్టీలకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వలేదని, మైనారిటీల ద్రోహి చంద్రబాబు అని ఆరోపించారు. ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ నంద్యాల లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నామని, 400 కోట్లతో మెడికల్ కళాశాల ఏర్పాటు చేశామని, నంద్యాలను జిల్లా కేంద్రంగా తీర్చిదిద్దామని ఇంకా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నామని, వీటిని ప్రజలు గుర్తించి రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఈ బహిరంగ సభలో పెద్ద సంఖ్యలో వైసిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

వైసీపీ నుండి టీడీపీలోకి చేరికలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంతో పాటు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో టిడిపి జెండాను ఎగరవేస్తామని మాజీ మంత్రి అఖిలప్రియ అన్నారు. శనివారం భూమా స్వగృహంలో చాగలమర్రి మండ లం మల్లె వేముల గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు తెదేపాలో చేరారు.మల్ల వేముల కు చెందిన చిన్న నాగన్న, చిన్న ఓబయ్య, చిన్న బాలన్న,నరసింహుడు,జగదీశ్వర్ రెడ్డి, హేమంత్ తో పాటు 15 కుటుంబాల వారు టిడిపిలో చేరారు.వారందరినీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వాని ంచారు. ఈ సందర్భంగా భూమా అఖిలప్రియ మాట్లాడుతూ ఈ రోజున మా నాయకత్వం మీద నమ్మకంతో పలువురు వైసీపీ నుండి తెదేపాలో చేరుతున్నారన్నారు. ఐదు సంవత్సరాలుగా అభివృద్ధి జరగలేదని టిడిపి తోనే అభివృద్ధి జరుగుతుందని నమ్మి తెలుగుదేశం పార్టీలోకి రావడం జరుగుతుందన్నారు.వీరందరూ గతంలో భూమా నాయకత్వంలోనే ఉండేవా రని వివిధ కారణాలతో వారు తెదేపాను వీడటం జరిగిందన్నారు. వైసిపి రాక్షస పాలన తట్టుకోలేక అభివృద్ధి చంద్రబాబు తోనే అని నమ్మి ఆయన ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ తెదేపాలోకి రావడం జరుగుతుం దన్నారు. వారిని మనస్ఫూర్తిగా తెదేపాలోకి ఆహ్వానిస్తున్నామన్నారు. అంద రం కలిసికట్టుగా కృషి చేసి ఆళ్లగడ్డ నియోజకవర్గంను అభివృద్ధి చేసుకుందామన్నారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో తాలూకా టిడిపి నాయకులు భార్గవ్ రామ్ నాయుడు, తాలూకా టిడిపి యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఇన్చార్జి సల్లా నాగరాజు, మండల టిడిపి కన్వీనర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణ పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - గడివేముల : బాల్యవివాహరహిత భారతదేశం ధ్యేయమని జె ఎస్ డబ్ల్యు సిమెంట్ లిమిటెడ్, కైలాసత్యర్థి చిల్డ్రన్ ఫౌండేషన్ వారు సంయుక్తంగా గడివేముల మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిందాల్ సిఎస్ఆర్ మేనేజర్ జి.రవికుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల సమాజంలో ఆడపిల్లలు అనేక ఒత్తిడి ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఈ దురాచారాన్ని అరికట్టాలని అందుకోసం పిల్లలు అవగాహన కలిగి ఉండాల న్న ఉద్దేశ్యం తో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడమైనదన్నారు. అదేవిధంగా కైలాసత్యర్థి చిల్డ్రన్ ఫౌండేషన్ కౌన్సిలర్ ఉషారాణి బాలికలకు ప్రత్యేకంగా వారు ఎదురుకుంటున్న సమస్యలపై అవగాహనను కల్పించడం జరిగింది. చిన్న వయసులో వివాహాలు అవడం వలన తలెత్తే ఆరోగ్య సమస్యలను వివరంగా బాలికలకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిందాల్ సిబ్బంది లక్ష్మీనారాయణ రెడ్డి, భాస్కర్, విజయలక్ష్మి, నవ యూత్ అసోసియేషన్ డైరెక్టర్ నరసింహులు, కోఆర్డినేటర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకట తిమ్మారెడ్డి, కౌన్సిలర్ ఉషారాణి మరియు స్కూలు హెడ్మాస్టర్ విక్టర్ ఇమ్మనియేలు,సిబ్బంది పాల్గొన్నారు.

గురురాజా విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

విశాలాంధ్ర - నంద్యాల : జన విజ్ఞాన వేదిక సంస్థ నిర్వహించిన జిల్లా స్థాయి నంది బాలోత్సవం పోటీల నందు శ్రీ గురురాజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అత్యధిక బహుమతులు సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ పి.షేక్షావలిరెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి పోటీల నందు వక్తృత్వం సీనియర్ విభాగంలోతారకేశ్వర్ ప్రథమ బహుమతి, జూనియర్స్ విభాగంలో సాయివర్షిని ప్రథమ బహుమతి, చిత్రలేఖనం జూనియర్స్ విభాగంలో ధరణిధర్ రెడ్డి ద్వితీయ బహుమతి, పద్య పఠనంలో గాయత్రి ప్రథమ బహుమతి, తెలుగులో మాట్లాడదాం ఏ. తారకేశ్వర్ ప్రథమ బహుమతి, క్లాసికల్ డాన్స్ జూనియర్స్ విభాగంలో సరయు ప్రథమ బహుమతి, సీనియర్స్ విభాగంలో త్రివేణి తృతీయ బహుమతి, ఏకపాత్రాభినయం సీనియర్స్ విభాగంలో సుభాన్ ప్రథమ, జానపద నృత్యం ప్రథమ బహుమతి ఇలా ప్రవేశించిన ప్రతి విభాగంలో అత్యధికంగా ప్రథమ బహుమతులు సాధించినట్లు డైరెక్టర్ తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను స్కూలు ఆవరణలో అభినందించారు. ఈ పోటీలందు విద్యార్థులు విజయాల కోసం శిక్షణ అందించిన ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన అనంత కళాశాల విద్యార్థులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణంలోని ఎద్దుల పాపమ్మ కళాశాల మైదానంలో ఈనెల 24 తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ పోటీలలో ఆళ్లగడ్డ అనంత జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉమ్మడి కర్నూలు మరియు నంద్యాల జిల్లా జట్టు టీంకు ఎంపిక కావడం జరిగిందని అనంత విద్యాసంస్థల అదినేత అనంత రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరణ్, ఇంద్ర, రాముడు, లక్ష్మణ్, చిన్న నరసింహ, లక్ష్మీ నరసింహ, ఉగ్ర దేవా, మహేష్, బాలాజీ, ప్రసాద్, మనోజ్ కుమార్, భరత్, మహేంద్ర తదితరులు జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందన్నారు. జనవరి నెల 11, 12, 13 వ తేదీలలో ప్రకాశం జిల్లా చీమకుర్తిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో తమ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. క్రీడలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఎంతగానో తోడ్పడుతాయని విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయానికి కృషిచేసిన కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటరమణను, విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు.

కానిస్టేబుల్స్ కు ప్రశంసా పత్రాలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వహిస్తున్న ఇరువురు కానిస్టే బుళ్లు జిల్లా ఎస్పీ రఘువీరారెడ్డి చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు ఎస్సై రమేష్ రెడ్డి శనివారం తెలిపారు.విధి నిర్వహణలో తమ ప్రదర్శన కనబరిచిన కానిస్టే బుళ్లు రాజా భాస్కర్,పి.నాగశేషులను ప్రశంసా పత్రాలతో సత్కరించినట్లు తెలిపారు. నంద్యాలలో జరిగిన అన్యువల్ క్రైమ్ రివ్యూ మీటింగ్ సందర్భంగా సత్కారం పొందారన్నారు. ఉత్తమ కానిస్టేబుళ్లుగా ప్రశంస అవార్డులు పొందడం పట్లఎస్ ఐ,పోలీసులు, ప్రజలు అభినందిస్తున్నారు

నేరాలు - ప్రమాదాలు తగ్గుముఖం

విశాలాంధ్ర -బేతంచెర్ల : ఈ సంవత్సర కాలంలో నేరాలు,ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయని,అలాగే సైబర్ నేరాల పై ప్రజలు మరింత అప్రమ త్తంగా ఉండాలని సీఐ ప్రియతమ్ రెడ్డి అన్నారు.శనివారం నేరాలపై సీఐ పత్రికా విలేకర్ల సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాల క్రైమ్ రిపోర్టపై వివరణ నిచ్చారు.హత్యలు 2021 సంవత్సరం లో 4,2022లో 4,కానీ 2023లో కేవలం 1మాత్రమేనని, మహిళల పై నేరాలు 2021లో 40,2022 లో 32,కానీ 2023 లో 21 మాత్రమేనని,పెద్ద దొంగతనాలు 2021లో3,2022లో 3,కానీ 2023లో ఒక్కటేనని, సాధారణ దొంగ తనాలు 2021లో 13,2022లో 6,2023లో 1,ప్రాపర్టీ రికవరీ 2021లో 38 శాతం,2022లో 74 శాతం కాగా 2023లో 85 శాతం కు చేర్చి భాదితులకు న్యాయం చేశామని, ఎస్సి ఎస్టీ కేసులు 2021లో 4,2022 లో 7,2023 లో 6,రోడ్డు ప్రమాదాల వల్ల చనిపోయిన వారు 2021లో 17,2022 లో 15,అయితే 2023 లో 11అని రోడ్డు ప్రమాదాల వల్ల గాయపడిన వారు 2021లో 8,2022 లో 7,2023 లో 8,కాగా సైబర్ క్రైమ్ రూపంలో అనగా ఆన్లైన్ ట్రాన్సక్షన్,లింకు ద్వారా వెబ్సైట్, జాబ్ చీటింగ్లో 2021లో 4,2022లో 5,అయితే 2023లో 11కేసులు నమోద య్యాయని,వీటిపై రాబోయే రోజుల్లో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని,ఇక గ్రామాల్లో కొట్లాటలు ,గొడవలు తగ్గుముఖం పట్టడానికి ముందస్తు గా బైండోవర్ కేసులు కట్టడం తో పొలం తగాదాలు, అక్రమ సంబంధాలు, స్థలాల పంచాయతీలను అరికట్టమాని, ఇక కొత్త సంవత్సరం వేడుకల్ని చాలా ప్రశాంతంగా జరుపుకోవాలని, ఏదైనా వేడుకలు జరుపుకోవాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరని,అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫ్లాట్ ఫాం పైకి బస్సు..తప్పిన ప్రమాదం

విశాలాంధ్ర - బనగానపల్లె: ఫ్లాట్ ఫామ్ పైకి బస్సు దొచుకుని వచ్చిన సంఘటన బనగానపల్లెలో ఆర్టీసీ బస్టాండ్లో చోటు చేసుకుంది. బనగానపల్లె డిపోకు చెందిన ప్రవేట్ బస్సు ఉదయం 6.40 సమయంలో బనగానపల్లె నుండి నంద్యాలకు వెళ్ళిందుకు ప్లాట్ ఫామ్ 5 వద్ద నిలుపుదల చేసేందుకు స్టేజి వద్దకు రావడం జరిగింది. బస్సు వేగంగా రావడంతో ప్లాట్ఫారం ఎక్కి స్తంభాన్ని ఢీకొని ఆగడం జరిగింది. ఆ సమయంలో ఆర్టీసీ ప్రయాణికురాలు ఒక మహిళకు గాయమైనట్లు తెలుస్తుంది. ఆ సమయంలో బస్సు ఎదురుగా ఎక్కువమంది ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆర్టీసీ డిప్యూటీ సూపర్డెంట్ వెంకటన్న వివరణ కోరగా ప్రైవేటు బస్సును నిలుపుదల చేసి డ్రైవర్ విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 31,డిసెంబర్ 2023

ఎమ్మిగనూరు సగరులకు కేటాయించాలి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : సగరులు భగీరథుని వారసులు అని చెప్పుకుంటారు.దేశవ్యాప్తంగా సగరులు దాదాపు 20కోట్ల మంది ఉన్నారు.ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూడా అన్ని నియోజకవర్గాలలో నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు.ఎమ్మిగనూరు, ఆలూరు,నంద్యాల, కర్నూలు లలో వేల కుటుంబాలు నివసిస్తున్నాయి. ఎమ్మిగనూరులో చేనేత వర్గాలతో సమానంగా సగరులు ఉన్నారు. ఆలూరు నియోజకవర్గంలో ఉన్న బిసి వర్గాలలో ఉప్పర(సగర) కులం కూడా పోటీపడేవిధంగా ఉంది. మరీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక నిర్ణయాత్మక శక్తిగా ఉన్న సగరులను ఏ రాజకీయ పార్టీ గుర్తించకపోవడం మమ్ములను విస్మయానికి గురిచేస్తున్నది. ఎమ్మిగనూరులో చేనేతలు ఎక్కువగా ఉన్నారని వైసీపీ పార్టీ చేనేతలకు సీట్ ఇస్తానని చెపుతోంది. అయితే ఎమ్మిగనూరు లో చేనేతలతో సమానంగా సగరులు ఉన్నారు.సగరుల వైపు కూడా ఒకసారి చూడండని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నాము .సగరులు కూడా రాజకీయాలకు పనికి వస్తామని నిరూపించుకుంటాం. మమ్మల్ని కూడా గుర్తించండి. చట్ట సభలలో ఉప్పర సగర కులానికి కూడా ప్రాతినిధ్యం కల్పించాలని రాజకీయ పార్టీలకు సగర ఉప్పర సంఘం తరపున డిమాండ్ చేస్తున్నాం.

3 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

విశాలాంధ్ర- కర్నూలు సిటీ : దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ పారిశుద్ధ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల జనవరి 3 నుంచి తప్పని పరిస్థితిలో సమ్మెకు కార్మికులు వెళతారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప హెచ్చరించారు. ఏఐటీయూసీ అనుబంధ సంస్థ ఏపీ మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శనివారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ప్రజా ఆరోగ్య శాఖ పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. అనంతరం ప్రజాఆరోగ్య శాఖ అధికారి విశ్వేశ్వర్ రెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మునెప్ప మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై డిసెంబర్ 28న పురపాలక,పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తో సచివాలయంలో మున్సిపల్ కార్మికుల ఐక్య కార్యచరణ సమితితో జరిపిన చర్చలు విఫలమయ్యాయని తెలిపారు. పారిశుద్ధ కార్మికుల సమస్యల పరిష్కార కోసం తప్పనిసరి పరిస్థితుల్లో రాష్ట్ర సమితి పిలుపమేరకు ఆందోళన చేపట్టడం జరిగిందని చెప్పారు. జగన్ ప్రభుత్వం 5 సంవత్సరాలుగా కమిటీల పేరుతో పారిశుద్ధ కార్మికుల సమస్యలపై కాలయాపన చేస్తుందని ఆయన విమర్శించారు. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, టాయిలెట్ టైం స్కేల్స్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు.సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం 26 వేలు చెల్లించాలన్నారు. టాయిలెట్ కార్మికులకు ఆరోగ్య భత్యం ఇవ్వాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు గత మూడు సంవత్సరాలుగా బకాయి పడిన సరెండర్ లీవ్ వేతనాలు చెల్లించాలన్నారు. జి.పి.ఎఫ్. ఖాతాల తెరవాలని, ఏపీజీఎల్ఐ బాండ్లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న 7డీఏలను తక్షణమే చెల్లించాలన్నారు. మున్సిపల్ కార్మికుల కోసం ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేసి స్థలాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, నగర ఉపాధ్యక్షులు రామాంజనేయులు, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్,బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు నల్లన్న, మున్సిపల్ యూనియన్ నాయకులు బాబూలాల్ ఏసన్న,మాణిక్యం,శివమునణర్,సాయి,అయ్యరాజు, సయ్యద్, షాలు, రాధ, లక్ష్మీ, పద్మావతి,సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ఈవిఎం గోడౌన్ లను పరిశీలించిన డీఆర్ఓ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఈవిఎం గోడౌన్ లను జిల్లా రెవిన్యూ అధికారి కే.మధుసూదన్ రావు పరిశీలించారు. జిల్లా రెవిన్యూ అధికారి కే మధుసూదన్ రావు మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టరేట్ లోని ఈవిఎం గోడౌన్‌లను ప్రతి మూడు నెలలకు ఒక్కసారి పరిశీ లించడం జరుగుతుందని అందులో భాగంగా ఈరోజు ఈవిఎం గోడౌన్‌లను పరిశీలించడం జరిగిందని డిఆర్ఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపరిండెంట్ మురళి, ఎలక్షన్స్ సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : రాజమండ్రి నగరంలో జనవరి 8,9,10 తేదీలలో జరుగు ఏపీ రైతు సంఘం 18వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మిరెడ్డి,రాష్ట్ర సమితి సభ్యులు బసాపురం గోపాల్ కోరారు. శనివారం ఏఐవైఎఫ్ కార్యాలయంలో రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నరసప్ప, ఎల్లప్పల ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి లక్ష్మిరెడ్డి,బసాపురం గోపాల్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రోద్యమ నేపథ్యంలో 1936 ఏప్రిల్ 11న స్వామి సహజానంద సరస్వతి అధ్యక్షులుగా, డాక్టర్ ఎన్జి.రంగా ప్రధాన కార్యదర్శిగా అఖిల భారత కిసాన్ సభ ఏర్పడిందని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దున్నేవాడిదే భూమి అనే నినాదంతో పది లక్షల ఎకరాల భూమి పేద రైతులకు పంపిణీ చేసి రైతాంగ పోరాటాలతో రైతుల పక్షాన నిలబడిందన్నారు. రైతు సంఘం 18వ రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా కిసాన్ సభ అధ్యక్ష, కార్యదర్శులు అంజన్ కుమార్, రావుల వెంకయ్య,ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రయ్య, కె.వి.ప్రసాద్ పాల్గొంటారని రైతులు పెద్ద ఎత్తున పాల్గొని భవిష్యత్తు ఉద్యమాలపై సన్నద్ధం కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పట్టణ అధ్యక్షులు రమేష్,పరుశురాం, కృష్ణమూర్తి,రంజిత్ గౌడ్ పలువురు పాల్గొన్నారు.

అంగన్వాడీలు సచివాలయ ఉద్యోగులకు వినతి

విశాలాంధ్ర - ఆదోని టౌన్ : తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం తాము చేస్తున్న సమ్మెకు సహకరించాలంటూ అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు శనివారం స్థానిక 25వ సచివాలయానికి వెళ్లి ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర సమితి సభ్యులు గౌసియాబీ, జిల్లా సమితి సభ్యులు జానకి, పట్టణ గౌరవాధ్యక్షులు టి.వీరేష్ మాట్లాడుతూ అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలపై గత నాలుగున్నర సంవత్సరాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకుంటూ వస్తూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గడిచిన 19 రోజుల నుండి అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లు సమ్మెలో పాల్గొంటుండగా కొంతమంది సచివాలయ ఉద్యోగులు ఎలాంటి లిఖితపూర్వ ఆదేశాలు లేనప్పటికీ అంగన్వాడీ సెంటర్లను బలవంతంగా తెరిచి నడుపుతున్నారని ఇలా చేయడం సరైంది కాదని, సాటి ఉద్యోగులుగా తాము చేస్తున్న పోరాటానికి సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉదృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్. సుదర్శన్, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కొత్తూరు ఈరన్న అంగన్వాడి పట్టణ కార్యనిర్వాక అధ్యక్షులు ఏ. విజయ్, సిఐటియు నాయకులు తిప్పన్న పీఎస్ గోపాల్, వీరారెడ్డి అంగన్వాడి నాయకులు ఈరమ్మ, శారద, గీతాదేవి ,ప్రభావతి ,శాంతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరు

విశాలాంధ్ర - పెద్దకడబూరు : టీడీపీ అధినేత చంద్రబాబు మాయ మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని కంబలదిన్నె గ్రామంలో గ్రామ సర్పంచ్ తిమ్మక్క, నరసప్ప ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నారని కొనియాడారు. వైఎస్ జగన్ తోనే పేదల అభివృద్ధి సాధ్యమన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు ఆరు గ్యారెంటీల పేరుతో మీ ముందుకు వస్తారని, ఆయన మాటలు నమ్మి మరోమారు మోసపోవద్దని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కబడ్డీ ఆడుతూ ప్రజలను, యువకులను ఉత్సాహపరిచారు.ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర యువనాయకులు ప్రదీప్ రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర రెడ్డి, మాజీ ఎంపిపి రఘురామ్, సచివాలయ జేసీఎస్ కన్వీనర్ రవిచంద్రా రెడ్డి, నాయకులు గజేంద్రరెడ్డి, విజయేంద్ర రెడ్డి, పెద్దకడబూరు గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, ఇస్మాయిల్, ముక్కరన్న, కోస్గీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అర్లప్ప, ఎంపీడీఓ ప్రభాకర్, ఏఈలు మల్లయ్య, సాయి కుమార్, వీఆర్వోసంజీవరావు,సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ప్రభుత్వం అంగన్‌వాడీ కార్మికులు 19 రోజుల నుండి ఆం దోళన చేస్తుంటే పట్టించుకోకుండా చర్చల పేరుతో కాలయాపన చేస్తూ నిర్లక్ష్యం చేస్తుందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్ మునెప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆనంద్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం దర్నా చౌక్ వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళన 19వ రోజుకు చేరుకుంది. ఈ ఆందోళన కార్యక్రమానికి ఏఐటీయూసీ నగర కార్యదర్శి జీ చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు.ఈ ఆందోళన కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు అంగన్‌వాడలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. తెలంగాణా ప్రభుత్వం కంటే అదనంగా వేతనాలు ఇస్తామన్న హామీలు సీఎం తుంగలో తొక్కారన్నారు. ప్రభుత్వం దిగివచ్చి వెంటనే ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీ వర్కర్స్ చేస్తున్న ఆందోళనకు ఏపీ మున్సిపల్ వర్కర్స్‌యూనియన్ సంఘీభావం తెలియచేసింది. ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులగం మద్దిలేటి మాట్లాడుతూ అంగన్‌వాడీలు చేస్తున్న న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు.అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పోస్టుకార్డుల ద్వారా తమ సమస్యలు పరిష్కరించాలని తెలియచేస్తూ పోస్టుచేశారు.

ఏపీయూడబ్ల్యూజే సంఘీభావం .... అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళనకు ఏపీయూడబ్ల్యూజే సంఘీభావం తెలియచేసింది. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఈఎన్ రాజు, ప్రదాన కార్యదర్శి కె శ్రీనివాసులుగౌడ్, ఐజేయూ సభ్యులు కొండప్ప, కె.నాగరాజులు మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ప్రభుత్వం వారి న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు శివ, జిల్లా కోశాధికారి శివ, సుంకన్న, హనుమంతు తదితరులు ఉన్నారు.

ఆడుదాం ఆంధ్ర కాదు జగన్ రెడ్డి...మా ఉద్యోగాలు ఎక్కడ..?

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : ఆడుదాం ఆంధ్ర పేరుతో జగన్ రెడ్డి విద్యా ర్థులను నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షకార్య దర్శులు సోమన్న, షాబీర్‌బాష విమర్శించారు. శనివారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా కర్నూలు నగరంలో కలెక్టరేట్ గాంధీ విగ్రహం దగ్గర ఏఐఎస్ఎఫ్ కర్నూల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సోమన్న,యస్.షాబీర్ భాష మాట్లాడుతూ అడుదాం ఆంధ్ర పేరుతో ఎన్నికల వస్తున్న సమయం దగ్గర పడుతున్న వేళా విద్యార్థులను నిరుద్యోగులను నమ్మించి మరోసారి మోసం చేయాలని కుట్రతో అడుదాం ఆంధ్ర పెరుతో ముందుకు వచ్చారని తెలిపారు. 4సంవత్సరాల లేనిది ఇపుడు ఎందుకు వచ్చింది అని ప్రశ్నించారు. అదుదాం ఆంధ్ర పేరుతో రాష్ట్రంలో, జిల్లాలో క్రీడలు నిర్వహిస్తున్నారు కానీ క్రీడాకారులను ఎక్కడ సరైన సదుపాయాలు లేవన్నారు. ఇండోర్ స్టేడియంలో కోచ్‌లు గా ఉన్న వారికి జీతాలు చెల్లించాలేని స్థితి ఉందన్నారు. కొన్ని కోట్లు ఖర్చు పెట్టి ప్రస్తుతం అదుదాం ఆంధ్ర పేరుతో క్రీడలు నిర్వహిస్తున్నారు కానీ వారికి ఇచ్చే బ్యాట్లు కూడా ఒక్క బంతి కోడితేనే విరిగిపోతున్నాయి అని తెలిపారు. నాణ్యత లేకుండా కోట్ల పెట్టుబడి పెట్టాలిసిన అవసరం ఏమి ఉందన్నారు. కేవలం ఎన్నికల దగ్గరకి వస్తున్నాయి రాష్ట్రంలో ఉద్యోగాలు విడుదల చేయక నిరుద్యోగులలో తీవ్ర వ్యతిరేకత ఉందని దానిని పొగొట్టలని ఈ క్రీడలు అన్నారు.నిరుద్యోగులు నిన్ను నమ్మే పరిస్థితులు లేరని జగన్ మోహన్ రెడ్డిని హెచ్చరించారు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉంటే ఇలా బటన్ నొక్కుడు కార్యక్రమాలు చేయడం కాదు. విద్యార్థులు యువకులు ఎదుర్కొన్నటువంటి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని విద్యార్థులు నిరుద్యోగులు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో నగర ఉపాధ్యక్షులు హరి,మహీంద్రా, సుశాంత్,జస్వంత్ ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఏర్పాటుకోసం జనసైనికులు కష్టపడాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : జనసైనికులందరూ టిడిపి జనసేన ప్రభుత్వాన్ని తెచ్చుకునేందుకు కష్టపడి పనిచేయాలని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి టి.జి భరత్ అన్నారు. శనివారం నగరంలోని అంబేద్కర్ భవన్‌లో జనసేన పార్టీ కర్నూలు నియోజకవర్గ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టి.జి భరత్ ముఖ్య అతిథిగా హాజరై జనసైనికులను ఉద్దేశించి మాట్లాడారు. జనసేన క్యాడర్ మొత్తం పవన్ కళ్యాణ్ మీద అభిమానం వల్ల భావోద్వేగంతో పనిచేస్తారన్నారు. ఏదైనా పని అనుకుంటే దాన్ని పూర్తి చేసేందుకు ఎంతవరకైనా పోరాడేందుకు జనసైనికులు సిద్ధంగా ఉంటారన్నారు. టిడిపి జనసేన ప్రభుత్వం వచ్చాక ప్రజలందరికీ మంచి పాలన అందుతుందని ముఖ్యంగా యువత భవిష్యత్తుకు మంచి మార్గం దొరుకుతుందన్నారు. టిడిపి హయాంలో అనంతపురం జిల్లాలో ఏర్పాటైన కియా పరిశ్రమ వల్ల ఆప్రాంతం రూపురేఖలు మొత్తం మారిపోయాయని తెలిపారు. అందుకే కర్నూల్లో తనను గెలిపిస్తే తనకున్న నెట్ వర్క్‌తో వివిధ కంపెనీలు కర్నూల్లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత తాను తీసుకుంటానని, ఉపాధి లేని వారందరికీ పని కల్పించి ఆదాయం వచ్చేలా చేస్తానని భరత్ తెలిపారు. ఈ విషయాలన్నీ యువత గ్రహించి ప్రజలకు వివరించి అర్థమయ్యేలా చెప్పాలన్నారు. పవన్ కళ్యాణ్ లాగే తాము కూడా ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లో ఉన్నామన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే వేస్తే ఐదేళ్లు తాను కష్టపడి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసుకుంటనన్నారు. అనంతరం జనసేన అసెంబ్లీ ఇంచార్జి అర్షద్ మాట్లాడుతూ ప్రజాసేవకు పవన్ కళ్యాణ్ కంకణం కట్టుకున్నారన్నారు. టిడిపి జనసేన ప్రభుత్వం వచ్చాక ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. కర్నూల్లో టి.జి భరత్ గెలుపు కోసం అందరం సమిష్టిగా కష్టపడదామని పిలుపునిచ్చారు. అనంతరం యువతకు కండువాలు కప్పి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్య క్రమంలో టిడిపి కర్నూలు నియోజకవర్గ పరిశీలకులు శ్రీనివాసమూర్తి, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, జనసేన ఐ.టి విభాగం నేతలు లక్ష్మీకాంత రెడ్డి, అనిత, నాగరాజు, టిడిపి వీరశైవ లింగాయత్ సాధికార సమితి నేత శివరాజ్, టిడిపి, జనసేన నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలక ప్రభుత్వాలను గద్దెదించుదాం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలు పరిష్కరించకుండా ప్రజలను సమస్యల వలయంలో నెట్టిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గద్దదింపడానికి సిపిఐ పోరాటమే శరణ్యం అని సిపిఐ పట్టణ కార్యదర్శి జి.రంగన్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సభ్యులు కేసి జబ్బర్ తెలిపారు. పట్టణంలో కటిక పేటలోని మైదాన్ లో సిపిఐ 99 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లిసిపిఐ సీనియర్ నాయకులు ఇస్మాయిల్ జెండా ఆవిష్కరించడంలి జరిగిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారం రాకముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి రావడం జరిగిందని, ప్రధానంగా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, సిస్సు బ్యాంకులో దాచిన నల్లధనాన్ని బయటికి తీసుకొచ్చి ప్రతి పేద వాడి అకౌంట్లో 15 లక్షల రూపాయలు వేస్తామని, వాగ్దానాలు చేసి ఇప్పటివరకు కనీసం సిస్ బ్యాంకుల నుండి పది రూపాయలు కూడా వెనక తీసుకువచ్చిన దాఖలు లేవని వారు తెలిపారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా అనేక హామీలు ఇచ్చి ప్రజల నెత్తిన చేతులు పెట్టి మోసం చేయడం జరిగిందని ఇప్పటికే రాష్ట్రంలో అనేక కార్మిక సంఘాలు సమ్మె సైరాన్ని ఊదడం జరిగిందని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కేవలం బటన్ నొక్కడం తప్ప, అభివృద్ధి కాని చూపుకు కూడా కనిపించడం లేదని కాబట్టి ఈ రెండు ప్రభుత్వాలను గద్ద దింపడమే మరో మార్గం లేదని అందుకు సిపిఐ సమరశీల పోరాటాలకు సంసిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా, సీనియర్ నాయకులు బజారి,కాజా,దాదావలి, మల్లికార్జున గౌడ్, రహిమాన్, రహీం, జమీర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

విశాలాంధ్ర - దేవనకొండ : ఇతరులకు ఇబ్బందులు లేకుండా ఎవరి పరిధిలో వారు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవచ్చునని దేవన కొండ ఎస్సై భూపాలుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా దేవనకొండ మండల దేవనకొండ ఎస్సై భూపాలుడు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇతరులకు చుట్టుపక్కల వారికి ఇబ్బందులు లేకుం డా చట్టానికి లోబడి నూతన సంవత్సరం వేడుకలు చేసుకోవాలని ఎస్సై భూపా లుడు ప్రజలకు పలు సూచనలు ఇచ్చారు. 2024 నూతన సంవత్స రం సందర్భంగా మండలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అనుమతులు లేవని స్పష్టం చేశారు. ఇతరులకు ఇబ్బందులు కలిగే విధంగా ఎవరు ప్రవర్తించినా, రోడ్ల మీద బైక్ లు పెట్టి గలటాలు చేసినా , బైక్లతో పెద్ద శబ్దాలు చేసినా, అనుమతులు లేకుండా స్పీకర్ లాంటివి పెట్టినా,మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే డ్రాంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన చట్ట రీత్యా చర్యలు తప్పవని ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. అప్రమత్తంగా ఉంటారని దేవనకొండ ఎస్సై భూపాలుడు ప్రజలకు తెలియజేశారు.

అంగన్వాడీల సమస్యలు పారిష్కరించకపోతే ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, తెలంగాణ కన్నా అదనంగా వెయ్యి రూపాయలు వేతనం అమలు చేయాలని గత 18 రోజులుగా రాష్ట్రంలో లక్ష ఆరువేల మంది అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి సమ్మె కనపడలేదా, అంగన్వాడీల సమస్యలు ముఖ్యమంత్రి కి పట్టావా..! సమ్మె పరిష్కారం చేయకపోతే గద్దె దింపుతామని ఎమ్మిగనూరులో చేపట్టిన అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ 19వ రోజున సోమప్ప సర్కిల్లో ఉన్న సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘాల నాయకులు కృష్ణవేణి, శిరోమణి, గోవర్ధనమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మా గురుడు సహాయ కార్యదర్శి విజయేంద్ర, సిఐటియు నాయకులు గోవిందు రాముడు, ఐఫ్టియు నాయకులు మహేంద్ర మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచమని అడుగుతుంటే డబ్బులు లేవని చెప్తున్నా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విశాఖపట్నం లోని రుషికొండ లో కడుతున్న బంగ్లాకు 450 కోట్ల రూపాయలు ఎక్కడ నుంచి వచ్చాయని ప్రజలకు, అంగన్వాడీలకు సమాధానం చెప్పాలని కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ వెంకటలక్ష్మి,బసమ్మ, షర్మిల,సాలమ్మ, నాగలక్ష్మి శైలజ నీరజ తదితరులు పాల్గొన్నారు.

నిరసనలో.. చంటి బిడ్డలతో అంగన్వాడీలు

విశాలాంధ్ర - వెల్దుర్తి : అంగన్వాడీలు చేపడుతున్న నిరసన సమ్మె శనివారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలు చంటి బిడ్డలతో కలిసి నిరసనలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల నిర్వహణ సచివాలయ సిబ్బందికి, గ్రామ, వార్డు ఉద్యోగులకు అప్పగించి అంగన్వాడీలు న్యాయబద్ధంగా చేస్తున్న నిరసన సమ్మెను హేళన చేసినట్లే సన్నారు.సమస్యలను పరిష్కరించి, ఇచ్చిన హామీ మేరకు జీతాలు పెంచాలని కోరుతున్న అంగన్వాడిల పట్ల నిర్లక్ష్యం వహించడం సిగ్గుచేటన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించి, డిమాండ్లను నెరవేర్చితే సమ్మెను విరమించడానికి సిద్ధంగా ఉన్నాయని, లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేసేందుకు వెనుకాడేదిలేదని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏపి అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాలు సుజాత, శిరీష, ఈదమ్మ, వరలక్ష్మి,హెప్సిబా, నాగమణి, సరస్వతి, విజయలక్ష్మి, రేణుక, అంగన్వాడి వర్కర్లు,హెల్పర్లు పాల్గొన్నారు.

ఎల్ఎల్సి దిగువ కాలువలో గుర్తుతెలియని శవం

విశాలాంధ్ర - హొళగుంద : హొళగుంద పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏడు మారి వద్ద ప్రవహించే ఎల్ఎల్సీ కాలువలు శనివారం గుర్తుతెలియని శవాన్ని గుర్తించామని ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.శవం ఆచూకీ కోసం ఎంత విచారించిన గుర్తించలేకపోయాను సంబంధికులు ఎవ్వరైనా ఉంటే సంబం ధిత పోలీస్ స్టేషన్ అధికారికి సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

గ్రామ స్వరాజ్యం జగన్ తో సాధ్యమైంది

విశాలాంధ్ర - కౌతాళం : జాతిపిత మహాత్మా గాంధీజి కలలు కన్నా స్వరాజ్యం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో సాధ్యమైందని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాల నాగిరెడ్డి అన్నారు. ఈ వారం గడపగడ పకు మన ప్రభుత్వం కార్యక్రమం మండల కేంద్రమైన కౌతాళంలో ముగింపు సభ నిర్వహించారు. సందర్భంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రం రాక ముందు గాంధీజీ కన్నా కళలు నేటి జగన్మోహన్ రెడ్డి పాలనతో సాకారం అయిందని అన్నారు. గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయానికి 40 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయని త్వరలోనే గ్రామంలోని సిమెంట్ రోడ్డు డ్రైనేజీ నిర్మాణం మంచినీటి సౌకర్యం తదితర సౌకర్యాల కల్పనలో ఖర్చు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ హౌసింగ్ డి ఈ మాట్లాడుతూ మండలంలో మొదటి విడత కింద 1500 ప్రక్క గృహాల నిర్మాణం, రెండవ విడత కింద1207 గృహాల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని ఇందుకోసం ప్రభుత్వం దాదాపు 15 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని హౌసింగ్ డి ఈ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు బుజ్జి స్వామి, కో ఆప్షన్ నెంబర్ మహబూబ్ సాబ్, వై సిపి మండల అధ్యక్షులు ప్రహ్లాద చారి, పార్టీ సీనియర్ నాయకులు దాట్ల కృష్ణంరాజు, వీర సేనా రెడ్డి, సర్పంచి పాల్ దినకర్, నాయకులు ఏకాంబర రెడ్డి, రాఘువేందర్ రెడ్డి, బాపురం గురునాథ్ రెడ్డి, వాలంటరీలు పాల్గొన్నారు.

ADONI MUNICIPALITY
e.procurement Short Tender Notice
Roc No.31/2023-24-E1 Dated: 28/12/2023
Invites Tender Notice under **GGMP Funds General Funds**
Down Loding Start Date and Time : 30-12-2023 @ 5 p.m.
Down Loding End Date and Time : 08-01-2024 @ 3.p.m.
For further details the tenderer may visit e procurement plot form on
www.tender.apeprocurement.gov.in.or Cell No.98499 06650
Raghunatha reddy G
Commissioner
Adoni Municipality

చంద్రబాబు తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - దేవనకొండ : మండల కేంద్రంలో శనివారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ తెలుగు యువత అధ్యక్షులు రాజసా హెబ్ ఆధ్వర్యంలో కార్యమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలకు టీడీపీ ప్రవేశపెట్టిన మిని మాని ఫెస్టోలోని అంశాలపై అవగాహన కల్పించారు. తల్లికి వందనం ద్వారా ఇంట్లో చదువుతున్న ప్రతి ఒక్కరికి ఏటా 15వేలు, ఆడబిడ్డ నిధి ద్వారా ప్రతినెలా 1500,అన్నదాతలకు ఏటా 20వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ యువతకు యువగళం ద్వారా ఉద్యోగాల కల్పన, దీపం పథకం ద్వారా ఏటా మూడు సిలెండర్ల ను ఉచితంగా అంద జేస్తారన్నారు.గ్రామప్రజలకు ష్యూరిటీ బాండ్లను అందజే శారు.గ్రామాల్లోని బూత్ ఇన్‌చార్జ్‌ల ఇంటింటికి వెళ్లి టీడీపీ మానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించి ప్రతి కుటుంబం సమాచారాన్ని టెలిగ్రామ్ బాట్‌లో అప్‌డేట్ చేయా లని సూచించారు.ఈ కార్యక్రమంలో బూత్ ఇన్చార్జిలు హుసేన్ పీరా.మురళి, రామాంజినేయులు. హుస్మాన్ ,ఐటీడీపి రామాంజినేయులు, నాయకులు పాల్గొన్నారు.

అండ - దండ ఎవరిది....!

- ప్రమాదపు అంచుల్లో జీనియస్ గ్లోబల్ స్కూల్
- స్కూల్ పబ్లిసిటీలో రియలిటి లేదన్న జనసేన..

విశాలాంధ్ర - గోనెగండ్ల: విద్యార్థులు గొప్ప విజయాలు సాధించాలన్న ఎవరెస్టును అవలీలగా ఎక్కాలన్న జీనియస్ గ్లోబల్ స్కూల్ లో చేర్చండి అని యాజమాన్యం గొప్పలు చెబుతూ విద్యార్థుల తల్లి తండ్రులను ఆకర్షించడంలో సఫలమయ్యారు కానీ విద్యార్థులకు ఇండియన్ పెట్రోల్ బంక్ అనుకొని అడ్డుగా పాఠశాలకు గోడ లేకుండానే రెండేళ్లుగా ప్రమాదపు అంచుల్లోనే విద్యను అందించడంలో మాత్రం ఘోరంగా విఫలమైపోయారని జనసేన పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జి రేఖాగౌడ్ పేర్కొన్నారు, గత రెండేళ్లుగా ప్రమాదపు అంచుల్లో విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు రావడంతో శనివారం పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం యాజమాన్యం నిర్లక్ష్యంపై వేలకు వేలు ఫీజుల వసూళ్ల గురించి అర్హత కలిగిన ఉపాధ్యాయులు అందించే విద్య విధానంపై అసంతృప్తి వ్యక్తం చేశారు, విద్యార్థుల జీవితాలను ఎవరి అండ దండలతో నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు, పబ్లిసిటీలో ఇచ్చే ప్రయారిటీ స్కూల్ రియాలిటీలో లేదనే విషయాన్ని గ్రహించాలని విద్య శాఖ అధికారులు ఇచ్చే గడువునే గాలికి వదిలేసేంత ప్రత్యేక శక్తి సామర్థ్యాలు ఒక

జీనియస్ గ్లోబల్ స్కూల్ కి మాత్రమే ఎలా సాధ్యమని ప్రమాదపు అంచుల్లో రెండేళ్లుగా పాఠశాల నిర్వహిస్తున్న తీరును చూసి ఆశ్చర్య పోవాలో బాధపడాలో అర్థం కావడం లేదన్నారు, స్కూల్ యాజాన్యం పెద్ద పెద్ద నాయకుల పవర్ అడ్డుపెట్టి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే తల్లి తండ్రుల ఆగ్రహానికి గురి అవుతారని హెచ్చరించారు. ఇలాగే కొనసాగితే తీవ్ర పరిణామాలు తప్పవన్నారు, జిల్లా విద్యాశాఖ అధికారులు ఇచ్చిన సంక్రాంతి గడువును జనసేన గడువుగా భావించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గానిగ బాషా, ఖాసిం సాహెబ్, మాలిక్, మధు, మల్లి, వెంకటేష్, సుబాన్, మహమ్మద్, ఖాసిం, రవి కుమార్,ఇబ్రహీం, పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

విశాలాంధ్ర - వెల్దుర్తి : 2024 నూతన సంవత్సర వేడుకలను యువకులు, ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, వేడుకలలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తే విధంగా ప్రవర్తిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని వెల్దుర్తి ఎస్సై పి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఒకప్రకటనతో మాట్లాడుతూ యువకులు ఎవ్వరు కూడా మద్యం ముత్తులో అల్లర్లు చేయకూడదని, ప్రజలకు, వ్యాపారస్తులకు, రహదారులకు, విద్యుత్ తీగలకు ఇబ్బందికరంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదన్నారు. సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వమించుకోవడానికి ముందుగా పోలీసుల అనుమతి తప్పక తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా ఎక్కడైనా డిజే సౌండ్ సిస్టమ్లు వాడితే వాటిని సీజ్ చేస్తామన్నారు. నేటి సాయంత్రం నుండి డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్లపై ప్రత్యేక డ్రైవ్లు నిర్వహించి కేసులు బనాయిస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, వీధుల్లో గుంపులుగా ఉండి ఈలలు, కేకలు వేస్తూ అసభ్యంగా ప్రవర్తించకూడదని, అన్ని హెూటళ్ళు, వైన్షాపులు, హైవేపై ఉన్న దాబాలు ఇతర దుకాణాలు నిర్దేశించిన సమయానికి మూసి పోలీసులకు సహకరించాలని, ప్రధానా కూడలీలలో కేక్ కటింగ్లు మరియు ఇతర వేడుకలు చేయరాదన్నారు. ప్రజల స్వేచ్ఛకు, అసౌకర్యానికి, శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎవ్వరైనా సరే అటువంటి వారిపై పోలీసుట్రీట్మెంట్ ఉంటుందన్నారు. కావున నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పోలీసులు మఫ్టీలో ఉండడం జరుగుతుందని, గట్టి బందోబస్తు ఏర్పాటు చేశావున్నారు.

ఉద్యోగుల నిరవధిక సమ్మె

విశాలాంధ్ర - కర్నూల్ జిల్లా పరిషత్ : కర్నూలు జిల్లా విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న అన్ని మండలాల సమగ్ర శిక్ష ఉద్యోగులు వారి సమస్యల పరిష్కారం కోసం శనివారం 11వ రోజు వినూత్నంగా కళ్ళకు నల్ల రిబ్బన్ దరించి నిరసన తెలియచేయడం జరిగింది. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జే.నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షలు ఎం.చంద్రశేఖర్ రాజు, కార్యదర్శులు రంగన్న జిల్లా నాయకులు రఫీ ,భాస్కర్ ,శంకర్ రమణ, వెంకట్ రాముడు, మధు ,మోహన్, నాయకులు నాగరత్నమ్మ మొదలగు పాల్గొనారు. ఈ నెల 31 వరకు వివిధ రూపాల్లో నిరసనలు మాస్ ర్యాలీలు కొనసాగుతాయని ప్రదర్శనకు ఉపాధ్యాయ సంఘాలు హాజరవుతారని ప్రదర్శనను జయప్రదం కొరకు ఉద్యోగులందరూ సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు.

న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు : బనగానపల్లె సిఐ

విశాలాంధ్ర - బనగానపల్లె: న్యూ ఇయర్ వేడుకలకు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు పలు ఆంక్షలు విధించినట్లు బనగానపల్లె సీఐ తిమ్మా రెడ్డి తెలిపారు. బనగానపల్లె సర్కిల్ కార్యాలయంలో బనగానపల్లె సీఐ తిమ్మారెడ్డి మాట్లాడుతూ 31వ తేదీ ఆదివారం రాత్రి ఒంటిగంట వరకు మాత్రమే నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని, మోటార్ బైకుల సైలెన్సర్ తీసివేసి అధిక శబ్దం వచ్చేలా రోడ్లపై ప్రయాణించరాదని, మద్యం సేవించి బైకులు నడపరాదని, మైనర్లు బైకులు నడపరాదని రహదారులపై కేకులు కట్ చేయడం చేయరాదని, అవుట్ డోర్ కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో డిజె సౌండ్ బాక్స్ లు బాణాసంచ కాల్చడానికి అనుమతులు లేవన్నారు. వైన్ షాపులు నిర్ణీత సమయంలో బంద్ చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పట్టుదలతో చదివినప్పుడే ఉన్నత శిఖరాలకు

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : మండల కేంద్రమైన కోయిలకుంట్లల పరిధిలోని కలుగొట్ల గ్రామానికి చెందిన హుస్సేన్ వల్లి ఇటీవల విడుదలైన ఎస్సై ఫలితాలలో ఉత్తీర్ణ అయినాడు.ఈ సందర్భంగా ఆయనకు నిరుద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు కోయిలకుంట్ల లోని రోటరీ క్లబ్ లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హుస్సేన్ వల్లి మాట్లాడుతూ పట్టుదలతో చదివితే విజయం ఎప్పుడు మన వైపు ఉంటుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమానికి నిరుద్యోగ సంఘం జెసి దేవరాజ్, విద్యార్థి సంఘం నాయకుడు ఓబులేసు, బిజెపి నాయకుడు వెంకటసుబ్బయ్య, కుందూ నది పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కామినేని గోపాల్ రెడ్డి, టిడిపి నాయకుడు పేరా శ్రీధర్ రెడ్డి ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.

గౌండా జాకీర్ ను పరామర్శించిన మాజీ సర్పంచ్

విశాలాంధ్ర - బనగానపల్లె : పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త ఖైరతాలి అల్లుడు గౌండా జాకీర్ ను మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి పరామ ర్శించారు. అవుకు మెట్ట బిల్డింగ్ లో నివాసం ఉంటున్న జాకీర్ ఇటీవల మోటార్ బైక్ ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటు న్నారు. విషయం తెలుసుకున్న బిసి రాజారెడ్డి వారి ఇంటి వద్దకు వెళ్లి గౌండా జాకీర్ ను పరామర్శించారు. ప్రమాద సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు.

అల్లరి చేస్తున్నారని మోకాళ్ళపై విద్యార్థులు

రక్త గాయాలయ్యాయా... బొబ్బలు లేచాయా..అంటూ నిర్లక్ష్యం సమాధానం చెబుతున్న ప్రిన్సిపాల్

విశాలాంధ్ర - పాణ్యం : సుదూర ప్రాంతాల నుంచి విద్య నేర్చుకోవడానికి వస్తున్న విద్యార్థిని విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలో క్రమశిక్షణ పేరుతో వివిధ రకాలుగా విద్యార్థులను శారీరకంగా బాధిస్తున్న పాఠశాల సిబ్బందిపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం పాఠశాలలో సిబ్బంది కొరత కారణంగా కొన్ని తరగతుల లో క్లాస్ లీడర్లు విద్యార్థులను డిసిప్లేన్ గా ఉంచేందుకు ఏర్పాటు చేశారు. ఏడవ తరగతిలో విద్యార్థులు అల్లరి చేస్తున్నారని ప్రిన్సిపాల్ దినేష్ బాబుకు ఫిర్యాదు చేయగా తన గది వద్ద ముగ్గురుని మోకాళ్ళపై నిలబెట్టమని సూచించాడు. చెప్పిందే అదనుగా ఆ తరగతి గది లీడర్ ఆ విద్యార్థులను ముగ్గురిని ప్రిన్సిపాల్ గారి గదికి ఎదురుగా మోకాళ్లపై నిలబెట్టాడు. పాఠశాల పరిసరాలను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ కు ఎక్కడ ఏం జరుగుతుందో అన్న విషయాలను గమనించేందుకు రౌండ్లకు వెళ్లాడు. సుమారుగా అరగంట సేపు మోకాళ్లపై నిలబడ్డ ఆ లేత శరీరాలు ఉక్కిరిబిక్కిరి బాధను భరించలేక కింద పడిపోయే విధంగా ఆ బాధను భరించలేక ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

రెండు నిమిషాలకే బొబ్బలు లేచాయా...ప్రిన్సిపాల్

విద్యార్థులు అల్లరి చేస్తున్నారని రెండు నిమిషాలు మోకాళ్లపై నిలబడితే వాళ్లకి రక్త గాయాలయ్యాయ, బొబ్బలు లేచాయా ,కాళ్లు విరిగిపోయాయ అంటూ ప్రిన్సిపల్ దినేష్ బాబు నిర్లక్ష్యం సమాధానంతో మీడియా మిత్రులకు తెలిపారు. గతంలో కూడా ప్రిన్సిపల్ పై ఎన్నో ఆరోపణలు వచ్చినా ఉన్నతాధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకుండా వదిలేయడంతో ఇక్కడ విద్యార్థుల పట్ల నిర్లక్ష్య ధోరణి, అసహనం, కోపము, ఆగ్రహ వేషాలు, కలిసి విద్యార్థులను శారీరకంగా, మానసికంగా, శిక్షను విధించే విధంగా తాండవిస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు మరొక మారు పునరావృతం కాకుండా జిల్లా విద్యా ఉన్నతాధికారులు ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలని అలాగే విద్యార్థుల సంరక్షణ పట్ల ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా రావుస్ కళాశాల వార్షికోత్సవం

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల మున్సిపల్ టౌన్ నందు రావుస్ కళాశాల వార్షికోత్సవం 31వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగిందని కళాశాల చైర్మన్ ఏఎంవి అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా రావుస్ కోచింగ్ అకాడమీ 1986లో ప్రారంభించి బ్యాంక్ కోచింగ్, ఏపీఆర్జేసీ కోచింగ్ ఇవ్వడం జరిగిందని, ఆ తర్వాత రాయలసీమ ప్రాంత విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడం కష్టంగా ఉన్నదని గమనించిన తర్వాత 1992లో రావుస్ కళాశాలను ప్రారంభించిన జరిగిందని తెలిపారు. ప్రారంభించిన అతికొద్ది కాలంలోనే నంద్యాలకు మొట్టమొదటి ఐఐటి సీటును అందించడం జరిగిందని అలాగే బిట్స్ పిలాని నందు కూడా సీటు సాధించడం జరిగిందని తెలిపారు. గత 31 సంవత్సరాలుగా వేలమంది విద్యార్థులను ఇంజనీర్లుగాను వందల కొద్ది విద్యార్థులను డాక్టర్లు గాను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపి పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ భాషా, మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబునిసా, జి. రవికృష్ణ, ఆర్ఐఓ సునీతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాలలో నాణ్యమైన విద్యను అతి తక్కువ ఫీజుకు అందిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారని, రావుస్ కళాశాలను 31 సంవత్సరాలుగా ఎలాంటి మచ్చ లేకుండా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కళాశాల యాజమాన్యం ఎలాంటి లాభా పేక్ష లేకుండా జేఈ ఈమెయిన్స్, నీటి నందు శిక్షణ ఇస్తూ ర్యాంకులు సాధిస్తున్నారని తెలిపారు. అత్యధిక మార్కులు తెచ్చిన విద్యార్థులకు ముఖ్య అతిథులు మెమొంటోస్ ఇవ్వడం జరిగినది. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు పాల్గొని వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, కో ఆప్షన్ మెంబర్ పడగండ్ల సుబ్రహ్మణ్యం, ప్రముఖ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ రోడ్డ సుంకయ్య, సంగమేష్, జగదీష్, నారాయణస్వామి, అధ్యాపకుని అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రజలు సహకరించాలి

విశాలాంధ్ర - రుద్రవరం : కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రజలు సహకరించాలని వైద్యాధికారి బాబు తెలిపారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిప్పారెడ్డిపల్లె గ్రామంలో శనివారం కుష్టు నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బాబు మాట్లాడుతూ జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా లెప్రసీ కేసు డిటెక్షన్ ఫర్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని ఈనెల 27 నుండి వచ్చే ఏడాది జనవరి 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం ద్వారా గ్రామాలలో కుష్టు వ్యాధి నిర్మూలలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఇందు కొరకు ఆశా కార్యకర్తలు ఒక వాలంటీ ఒక బృందంలో ఉండేలాగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఆరు బృందాలను ఏర్పాటు చేశామని ఈ బృందాలు గ్రామాలలో ఇంటింటికి తిరిగి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపడం ద్వారా దేశాధికారులు వారికి పరీక్షలు నిర్వహించి వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే

ఉచిత వైద్య సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ప్రజలు ఎవరికైనా చర్మంపై స్పర్శ లేని రాగి రంగు గల మచ్చలు, కనుబొమ్మలు కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, అరచేతులు అరికాలలో స్పర్శ కోల్పోవడం వంటి తదితర వ్యాధి లక్షణాలు ఉన్నట్లు అనుమానం వచ్చిన వెంటనే ఆశా కార్యకర్తలను కానీ సచివాలయం ఏఎన్ఎం ను కానీ విలేజ్ హెల్త్ సెంటర్లో ఎంఎల్ హెచ్పి ని సంప్రదించిన ద్వారా వారి సూచనల మేరకు వైద్యులను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ భూలక్ష్మి, ఎం ఎల్ హెచ్ పి నిరీక్షణ, ఆశా కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

సత్ గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : సత్ గురు సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి...15 ను సెలవు దినంగా ప్రకటించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ నాయక్ అన్నారు. శనివారం నాడు ఆత్మకూరు పట్టణంలోని అంబేద్కర్ భవన్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంజారా జాతిపిత, సేవాలాల్ మహారాజ్ పుట్టుకతోనే సంపూర్ణ జ్ఞానం కలిగిన వాడని, సేవాలాల్ మహారాజ్ బంజారా జాతి వారిని చైతన్య పరచి వారిని మంచి మార్గంలో నడిపించారని,బంజారా జాతి ప్రజల హక్కుల కోసం బ్రిటిష్ వారితో పోరాడారని, బంజారా ప్రజలను ఒక మంచి మార్గంలో నడిపించారని, సత్యమే పలకాలని,అహింసా మార్గంలో నడవాలని అనేక మంచి మాటలు చెప్పారని,

ఆయన జయంతిని బంజారా జాతి ప్రజలు ఒక పండుగలాగా జరుపుకుంటారని,ప్రభుత్వం ఆయన జయంతి ఫిబ్రవరి..15వ తేదీని ప్రతి సంవత్సరం సెలవు దినంగా ప్రకటించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు జవహర్ నాయక్,నాగస్వామి నాయక్, హనుమంతు నాయక్, రమేష్ నాయక్,రాజేష్ నాయక్, ఈశ్వర్ నాయక్, ప్రశాంత్ నాయక్,మల్లికార్జున నాయక్ పాల్గొన్నారు.

విజయవంతమైన రెడ్ క్రాస్ రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - కోవెలకుంట్ల : మండల కేంద్రమైనకోవెలకుంట్లలోని జ్యోతి సీబీఎస్సీ స్కూల్ నందు స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో దాదాపు 72 మంది ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు. ఈ రక్తదాన శిబిరంలో స్కూల్ కరస్పాండెంట్ సవిత్నాథ్ రెడ్డి, వారి సోదరులు అశోక్ రెడ్డి, మణికంఠ రెడ్డి తో పాటుగా దాదాపు 72 మంది రక్తదానం చేయడం చాలా స్ఫూర్తిదాయక విషయం అని ప్రతి ఒక్కరూ తమ తమ కార్యక్రమాలలో రక్తదాన శిబిరాన్ని కూడా జ్యోతి స్కూల్ వారి మాదిరిగా స్ఫూర్తిగా తీసుకోవాలని దస్తగిరి తెలిపారు. సవిత్నాథ్ రెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటుగా మా పాఠశాలలో సామాజిక చైతన్యం చేసే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తలస్మియా చిన్నారులకు ఉచితంగా రక్తదానం అందజేయడం జరుగుతుందని వారికి సహకరించాలని కోరిన వెంటనే మా పిలుపునందుకుని రక్తదానం చేసిన మా విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు, మా ఉపాధ్యాయ బృందానికి, రక్తదాన శిబిరం ఏర్పాటుచేసిన రెడ్ క్రాస్ సొసైటీ వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు భవిష్యత్తులో రెడ్ క్రాస్ కార్యక్రమాలు, జూనియర్ రెడ్ క్రాస్ పేరుమీద మా పాఠశాలలో నిర్వహిస్తామని చిన్నతనం నుండే విద్యార్థులకు సేవా దృక్పథం, సామాజిక స్పృహ లాంటి వాటిపై అవగాహన కలిగేలా పెంపొందిస్తామని తెలియజేశారు.

ఘనంగా సెమీ న్యూ ఇయర్ వేడుకలు

విశాలాంధ్ర - చాగలమర్రి : మండలంలోని ముత్యాలపాడు గ్రామ సమీపంలో గల బర్డ్స్ ఉన్నత పాఠశాలలో బర్డ్స్ డైరెక్టర్ పాల్‌రాజారావు, హెచ్‌ఎం సింధూర ఆధ్వర్యంలో సెమీ న్యూ ఇయర్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు 2023లో మంచి ఫలితాలు పాఠశాలకు మంచి పేరు ప్రతిష్ఠలు వచ్చాయని 2024లో కూడా బాగా కష్టపడి తల్లిదండ్రులకు,పాఠశాలకు మంచి పేరు తీసుకరావాలని విద్యార్థులకు సూచించారు.అనంతరం కేసు కోసి నూతన సంవత్సరం వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల నృత,సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమం లో ఉపాధ్యాయులు,ఉపాధ్యేతర సిబ్బంది, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - డోన్ రూరల్: శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని డిఎస్పి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక టౌన్ పోలీస్ స్టేషన్లో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం నేరాల సంఖ్య తగ్గిందని అలాగే వివిధ నేరాలలో పట్టుబడ్డ వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా మాదకద్రవ్యాలు, సారా, మట్కా వంటి కార్య కలాపాలు నిర్వహించే వారి పట్ల తగిన చర్యలు తీసు కొంటామని తెలిపారు. సెల్ ఫోన్, సైబర్ క్రైమ్, ఇళ్లలో దొంగతనాలు,దారిదోపిడి వంటి నేరాలకు పాల్పడిన వారిని గుర్తించి పట్టుకోవడంలో ప్రతిభను చూపిన పోలీస్ అధికారులను ప్రశంసించారు. రాబోయే నూతన సంవత్సర వేడుకలలో డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ ఇతరులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు చేసుకుంటామని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.టౌన్ సిఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

అటవీ సంరక్షణలో ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర - రుద్రవరం : అటవి సంరక్షణ పట్ల సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఆత్మకూరు స్క్వాడ్ డీఎఫ్ఓ రామ కొండారెడ్డి సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన రుద్రవరం రేంజ్ పరిధిలోని నూతల నార్త్ సెక్షన్, నూతల సౌత్ బీట్ లో చేపట్టిన ఫైర్ లైన్ పనులను ఆయన పరిశీలించారు.అనంతరం అహోబిలంలోని డిప్యూటీ రేంజ్ కార్యాలయానికి చేరుకుని ఆయన పలు రికార్డులను పరిశీలించారు. ఈయన వెంట మహానంది రేంజ్ అధికారి శ్రీకాంత్ సెక్షన్ అధికారులు శ్రీనివాసరెడ్డి, మహానంది సెక్షన్ అధికారి, పలువురు అటవిశాఖ సిబ్బంది ఉన్నారు.

వెంకటేశ్వర ఆలయంలో ఘనంగా పూజలు

విశాలాంధ్ర - రుద్రవరం : రుద్రవరం సమీపంలో కొలువైన వాసపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు, నంద్యాల, జిల్లాలలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు వందల సంఖ్యలో తరలివచ్చి వెంకటేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు వారణాసి గోపి శర్మ ఆధ్వర్యంలో కుంకుమార్చన ధూప దీప నైవేద్యాలతో పూజలు ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు హాజరైన భక్తులకు నిర్వాహకులు అల్పాహారం ఏర్పాటు చేశారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : విద్యార్థిని, విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని హైకోర్టు న్యాయవాది గోగిశెట్టి నరసింహారావు అన్నారు. శనివారం మండలంలోని అహోబిలం గిరిజన ఆశ్రమ పాఠశాల, పడకండ్ల సమీపంలోని గిరిజన బాలుర వసతి గృహంలో 300 మందికి పైగా విద్యార్థులకు ప్రముఖ హైకోర్టు న్యాయవాది గోగి శెట్టి నరసింహారావు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత చలికాలంలో చలి తీవ్రత ఎక్కువగా ఉన్నందువల్ల వసతి గృహాలలో చలికి వణుకుతూ విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను తాను గమనించడం జరిగిందని పేద విద్యార్థులు చలి తీవ్రత బారిన పడి ఇబ్బందులు పడకుండా దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకొని విద్యలో రాణించాలన్నారు.విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకుని రావాలని నరసింహారావు పేర్కొన్నారు. వాటి పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ మేరీ సలోమి, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ బాషా, డాక్టర్ సాగర్, కృష్ణమూర్తి, పెద్ద కందుకూరు గ్రామానికి చెందిన ఆళ్ల పెద్ద సుబ్బయ్య, అర్జీ గారి నరసింహులు, దుర్వేసుల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

విశాలాంధ్ర - శిరివెళ్ల : సర్కిల్ పరిధిలోని రుద్రవరం, శిరివెళ్ల, గొస్పాడు మండలాల పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు నిబంధనలకు లోబడి నూతన సంవత్సర వేడులు జరుపుకోవాలని శిరివెళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ వంశీధర్ పిలుపునిచ్చారు.శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూనే ప్రజలకు ముఖ్యంగా యువతకు పలు సూచనలు,సలహాలు అందజేశారు. నూతన సంవత్సర వేడుకలు ఆనందోత్సవాలతో జరుపుకోవాలనీ శాంతి భద్రతలకు ఎటువంటి భంగం వాటిల్లకుండా తమ తమ నివాసాల్లో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని తెలియజేశారు. 31వ తేదీన రాత్రి పది గంటలు తరువాత ప్రజల వీధులలో సంచరించడం, అధికమంది గుమికూడి ఉండటం మద్యం సేవించి బైకుల సైలెన్సర్లు తీసి త్రిభుల్ రైడింగ్ వంటి సంఘటనలకు పాల్పడితే చట్టపరమైన కఠీన చర్యలతో పాటు కేసులు నమోదు చేసి న్యాయస్థానాల్లో హాజరు పరుస్తామని హెచ్చరించారు.తల్లి తండ్రి భార్య పిల్లలు శ్రేయోభిలాషుల మధ్య నూతన సంవత్సర వేడుకలు జరుపుకొని చెడు వ్యసనాలకు చట్టవిరుద్ధ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

సంపాదకీయం

చిగురిస్తున్న కొత్త ఆశలు

జన జీవితాలు మారకపోయినా క్యాలెండర్‌లో కాగితాలు తిరుగుతూనే ఉంటాయి. రోజులు, వారాలు, నెలలు గడిచిపోతూనే ఉంటాయి. అలా మరో సంవత్సరం మారిపోయింది. ఓ మనిషి జీవిత కాలంలో ఒక సంవత్సరం మహత్తరమైంది ఏమీ కాదు. మంచో, చెడో అనేక సంఘటనలు జరిగి ఉండొచ్చు. మంచిని గుర్తుంచుకోవడం కష్టమే కావచ్చు. కానీ చెడు చారలు అంత సులభంగా మాసిపోవు. 2023 సాంకేతిక, వినూత్న ఆవిష్కరణల, సాంస్కృతిక, మౌలిక సదుపాయం కల్పనారంగంలో విశిష్టమైన మార్పులు తీసుకొచ్చి ఉండొచ్చు. అలాగే దుష్పోక్యాలవల్ల మానని గాయాలులేని ఉండొచ్చు. అవి జీవితాంతం మానకుండా చారలుగా మిగిలిపోయి ఉండొచ్చు. ఈ దశాబ్దంలోకెల్లా ఈ సంవత్సరంలో క్యాలెండర్ గిర్రున తిరిగినట్టు అనిపిస్తోంది. ఈ సంవత్సరం ముగిసిన నాలుగు నెలలకే సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి కనక గత తొమ్మిదేళ్ల ఏనిమిది నెలల పాలన తెచ్చిపెట్టిన విభజన, విద్వేష రాజకీయాలు త్వరలో ముగిసిపోతాయన్న ఆశావాదంతో ఉన్న వారికి ఈ ఏడాది తొందరగా ముగిస్తే బావుండుననిపించవచ్చు. నూతన సంవత్సరం వల్ల మన జీవితం అమాంతం మారిపోక పోయినా ఆ తలంపే కొత్త ఆశలను చిగురింప చేస్తుంది. 2024లో మన దేశంలో సార్వత్రిక ఎన్నికలే కాకుండా అమెరికా, రష్యా, బంగ్లా దేశాల అధ్యక్ష స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. పొరుగున ఉన్న పాకిస్థాన్‌లోనూ ఎన్నికలు జరగాల్సి ఉంది. మన దేశంలో ఐదు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు నిర్వహిస్తారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికలలో బీజేపీ అనూహ్యంగా ఘన విజయం సాధించడం ప్రతిపక్షాలను, మెరుగైన పాలనకోసం ఎదురుచూస్తున్న పౌరులకు కొంత నిరాశ కలిగి ఉండొచ్చు. 2023వ సంవత్సరం ఆసాంతం నిరాశ కలిగించలేదు. అనేక విజయాలు సాధించాం. చంద్రయాన్ ప్రయోగం ద్వారా ఖగోళ శాస్త్ర పరిశోధనల్లో గణనీయమైన మైలురాయిని అధిగమించాం. స్టాక్ మార్కెట్లు మునుపెన్నడూ లేని సరికొత్త రికార్డులు సృష్టించాయి. అయితే స్టాక్ మార్కెట్ సూచీలు దేశ ఆర్థిక వ్యవస్థకు సూచీలుగా పరిగణించే వారికి కొదవలేకపోయినా సామాన్యుల ఆర్థిక పరిస్థితికి ఆ ఎదుగుదల ఎంత మాత్రం కొలమానం కాదు. జీ20 సమావేశాలు దిగ్విజయంగా పూర్తి అయినాయి. ఇది ప్రతి ఏడాదీ జరిగేదే అయినా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతి విజయాన్నీ తన ఖాతాలో వేసుకుని అది తన వ్యక్తిగత విజయం అనుకుంటారు. సినిమా రంగం ఆస్కార్ అవార్డు సంపాదించడం ముఖ్యంగా తెలుగువారికి గర్వకారణమే. అంతర్జాతీయంగా చూస్తే జనం గుండెల మీద టిక్ టిక్ అనే అణు కేంద్రాలను సంపూర్ణంగా మూసివేయాలని ఏడాది ముగుస్తున్న సమయంలోనే జర్మనీ నిర్ణయించడం మానవాళికే ఆనందదాయకం. అదే సమయంలో 2022లో ప్రారంభమైన రష్యా–ఉక్రేన్ యుద్ధం ఇంకా కొనసాగుతుండడం, ఇజ్రాయిల్ మీద పలస్తీనియన్ పోరాటయోధుల సంస్థ హమాస్ మెరుపు దాడి చేసి అపారమైన నష్టం కలిగించడం శాంతి చెదరడానికి సంకేతం. కానీ తమ మీద జరిగిన దాడికి ప్రతీకారంగా ఇజ్రాయిల్ ప్రభుత్వం కొనసాగిస్తున్న మారణ హోమం మానవాళి మీదే ప్రకటించిన యుద్ధం. టర్కీ సిరియా, నేపాల్‌లో భయానక భూకంపాలు, అమెరికాలో విచ్చలవిడి కాల్పుల సంఘటనలు, పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు జైలు శిక్ష విధించడం, మరో మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ప్రవాస జీవితం చాలించి స్వదేశం తిరిగి రావడం 2023లోనే జరిగాయి. 2023 ఆరంభంలోనే భూకంపంవల్ల టర్కీలో 59,000 మంది మరణిస్తే సిరియాలో ఎనిమిది వేల మంది సజీవ సమాధి అయ్యారు. ఇదే సంవత్సరం మన దేశ జనాభా చైనా జనాభాను అధిగమించింది. అదే సమయంలో పెరుగుతున్న మానవ వనరులను సద్వినియోగం చేసుకునే మార్గం ఏమిటి అన్న ప్రశ్న కూడా వేధిస్తోంది. ఇజ్రాయిల్ పలస్తీనియన్ల మీద కొనసాగిస్తున్న కిరాతక దాడిలో ఇప్పటికే ఇరవై వేల మంది పలస్తీనియన్లు మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. గాజాలో 20 లక్షలకు పైగా జనం ఉంటే అందులో 90 శాతం మంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వలస పోవలసి వచ్చింది. ఖలిస్తానీ తీవ్రవాది అనుకుంటున్న నిజ్జర్ హత్య కెనడాతో మన సంబంధాలు బెడిసికొట్టేలా చేసింది. అలాగే పనూన్ విషయంలో అమెరికాతో వైషమ్యాలకు దారి తీసింది. జాతీయ అంతర్జాతీయ పతకాలు సాధించిన మహిళా మల్లయోధులు ఈ ఏడాది ఆరంభంలో ఢిల్లీలో రోడ్డెక్కి నిరసన చేస్తే వారి ఇబ్బందులు ఇప్పటికీ తీరనే లేదు. ఇటీవల జరిగిన భారత కుస్తీ సమాఖ్య ఎన్నికలలో మల్ల యోధులపై అఘాయిత్యం చేసిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ సహచరుడు సంజయ్ సింగ్ గెలిచారు. దీనికి నిరసనగా సాక్షీ మాలిక్ తాను ఇక పోటీలలో పాల్గొననని ప్రకటించాల్సి వచ్చింది. జడుసుకున్న మోదీ ప్రభుత్వం కంటి తుడుపుగా ఆ ఎన్నికలను రద్దు చేసింది. మల్లయోధుల పోరాటానికి సంయుక్త కిసాన్ మోర్చా రైతులు సహా సానుభూతి తెలియజేయడం ప్రజోద్యమాల విస్తృతికి నిదర్శనం. మోదీ హయాంలో విద్వేష రాజకీయాలు ఈ ఏడాది కూడా యథావిధిగా కొనసాగాయి. 2024 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మోదీ నాయకత్వంలోని బీజేపీ అయోధ్యలో రామమందిర ఆవిష్కరణ సందర్భంగా మళ్లీ ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. అయోధ్య ఉద్యమానికి మూలకారకులైన లాల్‌కృష్ణ అద్వాణీ, మురళీ మనోహర్ జోషికి ప్రారంభోత్సవ ఆహ్వానాలు అందించి వెంటనే మీరు హాజరు కాకూడదని ఆంక్ష విధించింది. మరో వేపు 27 ప్రతిపక్షాలు కలిసి "ఇండియా" ఐక్య సంఘటన ఏర్పాటు చేసినా ఎన్నికల దగ్గర పడుతున్న కొద్దీ సీట్ల పంపకంలో అవాంతరాలు ఎదురవుతున్నాయి. ఈ ఐక్య సంఘటన సంపూర్ణంగా ఐక్యమైతే తప్ప బీజేపీతో ముఖాముఖి పోటీకి అవకాశం ఉండదు. అంటే మోదీని గద్దెదించాలన్న లక్ష్యం నెరవేరదు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ మోదీ బలపడుతున్న ఛాయలు కనిపిస్తున్నాయి. "ఇండియా" ఐక్య సంఘటనలోని బెంగాల్ ముఖ్యమంత్రి ఈ సంఘటన అధికారంలోకి వస్తే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధాని అవుతారని ఏకపక్షంగా ప్రకటించి ఒక దెబ్బతో రెండు పిట్టలను కొట్టే ప్రయత్నం చేశారు. ఇంకో వేపు మోదీ హయాంలో పార్లమెంటు ఎందుకూ కొరగాకుండా పోతోంది. మోదీ ప్రతిపక్షాలు లేని పార్లమెంటును కోరుకుంటున్నారని దాదాపు 150 మంది ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేసి దుష్ట చరిత్ర సృష్టించారు. ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద విఘాతం. నూతన సంవత్సరం మీద ప్రజలకు అనేక ఆకాంక్షలు ఉంటాయి. జన జీవితాలను ప్రభావితం చేసేవి రాజకీయాలే. అందువల్ల మోదీని గద్దె దించితే తప్ప దేశ పరిస్థితి మెరుగు పడే అవకాశం ఉండదు. ప్రతిపక్షాలకు లక్ష్య శుద్ధి ఉంటే తప్ప ఇది సాధ్యం కాదు.

తమిళ రాజకీయంలో 'కెప్టెన్' ముద్ర

తీర్థంకర్ మిత్ర

ప్రముఖ తమిళ నటుడు, డీఎండీకే పార్టీ అధినేత విజయ్‌కాంత్ తమిళ చలనచిత్ర రంగంలో, రాజకీయ రంగంలో "కెప్టెన్"గా తనదైన ముద్ర వేశారు. సినీ నటుడుగానే కాకుండా, 2005లో దేశీయ ముర్పొక్కు ద్రవిడ కళగం(డీఎండీకే) పేరిట రాజకీయ పార్టీని స్థాపించి రాజకీయాల్లోనూ ఆయన రాణించారు. అశేష అభిమానుల ఆదరాభిమానాన్ని చూరగొన్నారు. 1952 ఆగస్టు 25న నారాయణ్ విజయరాజ్ అళగర్‌స్వామిగా జన్మించిన విజయ్‌కాంత్ సంప్రదాయక తమిళ కులాలకు చెందినవారు కాదు. 1979లో సినిమారంగ ప్రవేశంచేసిన విజయ్‌కాంత్ 1991లో నిర్మించిన 100వ చిత్రం "కెప్టెన్ ప్రభాకరన్" విడుదలైనప్పటి నుంచి ఆయనకు 'కెప్టెన్' అనే పేరొచ్చింది. ఆయనను 'పురట్చి కలైగర్' అని కూడా పిలుస్తారు, దీని అర్థం 'విప్లవ కళాకారుడు'. విజయ్‌కాంత్ ఎంజీఆర్‌ను ఆరాధ్యదైవంగా కొలిచేవారు. కింగ్ మేకర్ అయిన వ్యక్తి ఎప్పటికీ రాజు కాలేడన్నది విజయ్‌కాంత్ విషయంలో సత్యం. నాయకుడిగా అన్ని అర్హతలు ఉన్నప్పటికీ విజయం ఆయనను వెతుక్కుంటూ రాలేదు. 1979లో ఆయన నటించిన 'ఇనిక్కుంఇలమై' తర్వాత వరుస ఫ్లాప్‌ల పరంపర కొనసాగింది. ఆయినా ఎప్పుడూ నిరుత్సాహపడలేదు. ఓటమితో పోరాడుతూనే ఉన్నారు. పల్లెటూళ్లలో ఈ సినిమా ఏడాదిపాటు ఆడినప్పటికీ పట్టణ ప్రేక్షకులను అంతగా ఆకట్టుకోలేకపోయింది. తదనంతర పరిస్థితులు విజయ్‌కాంత్‌కు అనుకూలంగా మారాయి. అభిమానుల ప్రోద్బలంతో 'డీఎండీకే' పార్టీని స్థాపించినప్పటికీ రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూశారు. ఎన్నికల్లో విజయం, అపజయాలను చాకచక్యంగా ఎదుర్కొనే రాజకీయ చతురత లేకపోవడంతో, అభిమానుల ఓటు బ్యాంకు విజయ్‌కాంత్‌ను నిరాశపరిచింది. 1980వ దశకంలో ఆ తర్వాత కాలంలో విజయ్‌కాంత్ చిత్రాలకు ప్రేక్షకుల నుంచి అత్యంత ఆదరణ లభించింది. ఇది ఆయన ఊహించనిదే అయినప్పటికీ ఆశ్చర్యపరిచింది. అయితే రాజకీయాల్లో మాత్రం ఆయన ఊహించినంతగా జనం ఆదరించలేకపోయారు. విజయ్‌కాంత్ డీఎండీకే పార్టీ స్థాపించిన దశాబ్ది కాలంలోనే తీవ్ర ఆటుపోట్లకు లోనైంది. సినీరంగంలో మాత్రం నూతన శిఖరాలకు చేరుకున్నారు. సినీరంగంలో నిచ్చెన దిగువ నుంచి తన ప్రయాణాన్ని ప్రారంభించవలసివచ్చింది. సినిమాల్లో పోషించిన వివిధ పాత్రలు విజయ్‌కాంత్‌కు ఈ పరిమితులను అధిగమించడంలో సహాయపడ్డాయి. రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణించలేని అనేకమంది కంటే కులరాశిత వ్యక్తి అయిన విజయ్‌కాంత్ తన అభిమానుల వీరాభిమానానికి పాత్రులయ్యారు. విజయ్‌కాంత్ చాలా సినిమాల్లో పోలీస్ ఆఫీసర్‌గా నటించారు. విజయ్‌కాంత్ నటించిన చిత్రాలు ఇతివృత్తాలన్నీ అవినీతికి వ్యతిరేకంగా నిజాయితీ, ధర్మబద్ధంగా ఉండేవి. ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడం ప్రేక్షకుల్లో ఆయనకు మద్దతు, ఫునాదిని పెంచాయని చెప్పవచ్చు. విజయ్‌కాంత్ అభిమానులు దాదాపు ఆర్థికంగా, సామాజికంగా అట్టడుగున ఉన్నవారే. ఇదే కెప్టెన్ విజయ్‌కాంత్ "కరుప్పు ఎంజిఆర్"(నల్ల ఎంజీఆర్)గా మారేందుకు దోహదపడింది.

తమిళనాడులో 2006లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో తీవ్రవాదులకు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేక పోరాట యోధుడిగా విజయ్‌కాంత్ తెరపైకి వచ్చారు. ఈ ఎన్నికల్లో డీఎండీకే 8.5 శాతం ఓట్లు కైవసం చేసుకుంది. 2011లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో డీఎండీకే రెండవ అతిపెద్ద పార్టీగా అవతరించింది. కానీ అది డీఎంకే, ఏఐడీఎంకేకు ప్రత్యామ్నాయంగా నిలవలేకపోయింది. సినిమా నేపథ్యంలేని రాజకీయ ప్రవేశం ఉన్న ప్రేమలతను విజయ్‌కాంత్ వివాహం చేసుకున్నారు. ఒకానొక దశలో తాను వీల్‌చైర్‌కు పరిమితం కావడంతో సహజంగానే వక్త అయిన ప్రేమలతను డీఎండీకే ప్రధాన కార్యదర్శిగా చేశారు.

కాళేశ్వరంకన్నా కనాకష్టం పోలవరం!

వి. శంకరయ్య

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకున్నా వివిధ విభాగాల పనులు పూర్తిచేసి ఎంతో కొంత మేర నీళ్లు పారించారు. నాణ్యత పక్కన పెడితే మూడు బ్యారేజీల నిర్మాణం జరిగింది. నిర్మించిన పంపు హౌస్‌లు పని చేశాయి. కాని పోలవరం ప్రాజెక్టు కాళేశ్వరం కన్నా కనాకష్టంగా మిగిలి పోయింది. నిర్మాణం పూర్తి కాక పోవడం లోసుగులు బయటపడ్డాయి. పైగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించే జాతీయ ప్రాజెక్టు. ప్రాజెక్టు నిర్మాణంలో ఏ విభాగమూ పూర్తి కాలేదు. నీళ్లు పారించడం అటుంచి ఏ ఒక్క విభాగమైనా ఎప్పుడు పూర్తి అవుతుందో చెప్పలేమని సాక్షాత్తు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రకటించడం కొసమెరుపు. 2017–18 షెడ్యూల్ రేట్ల మేరకు తొలి దశ (41.15 మీటర్ల ఎత్తు) పూర్తి చేయడానికి 36, 449.83 కోట్ల రూపాయలు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. కాని కేంద్ర జల సంఘం 31, 625 కోట్ల రూపాయలకు ఆమోదం తెలిపింది. రాజ్యసభలో కేంద్ర మంత్రి చెప్పిన మేరకు ఒక దఫా 17, 144 కోట్ల రూపాయల కోరిన రాష్ట్ర ప్రభుత్వం తిరిగి 19, 517 కోట్ల రూపాయలకు టెండర్ పెట్టింది. ఏ మొత్తమైనా కేంద్ర ఎప్పుడు ఇస్తుందో తెలియదు. ఈ లోపు ఎన్నికలు తరుము కొస్తున్నాయి.

ఈ నెల మొదటి వారం నుంచి అటు రాష్ట్ర జల వనరుల శాఖ అచేతనంగా పుండి పోయింది. అంతకు ముందే కాంట్రాక్టు సంస్థ చేతులెత్తేసింది. 2019 ఎన్నికల ముందు ఏం జరిగిందో అందరికి తెలుసు. మరీ ఇప్పటి రాజకీయ పరిస్థితిలో వివాదాల మధ్య పనులు చేపట్టిన కాంట్రాక్టరు మరింత జాగ్రత్త పడే అవకాశం వుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బీటలు వారి కాంట్రాక్టర్ మెడకు చుట్టుకొన్నట్లు పోలవరం ప్రాజెక్టులో గైడ్‌బండ్ కూలి పోవడం కాంట్రాక్టు సంస్థకు చిక్కులు తెచ్చి పెట్టే అవకాశం వుంది. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం పూర్తయి నీళ్లు నిల్వ చేసిన తర్వాత బీటలు వారింది. కాని పోలవరంలో గైడ్ బండ్ నిర్మాణ దశలోనే కూలి పోయింది. ఈ సమస్యలకు మించి గైడ్ బండ్ కూలి పోవడానికి ఎవరు బాధ్యులో తేలిన తదుపరనే ముందుకు వెళతామని అంటే తొలి దశ నిధులు గురించి ఆలోచించతామని కేంద్ర ప్రభుత్వం షరతు పెడుతోంది. సరిగ్గా ఎన్నికల ముందు మేడిగడ్డ బీటలు వారి కేసీఆర్ ఓటమికి ఒక అంశమైనట్లే పోలవరంలో కూడా ఎన్నికల ముందు తను ఏరి కోరి తెచ్చుకొన్న కాంట్రాక్టరును దోషిగా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సిద్ధ పడతారా? తేలాల్సివుంది. ఏతావాతా తేలేదేమంటే ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు కేంద్రం నుంచి చిల్లిగవ్వ రాదు.

తాజాగా కాళేశ్వరం ప్రాజెక్టుకు మరో చిక్కు ఏర్పడింది. బ్యారేజీల ఎఫ్‌ఆర్ఎల్ నీటి మట్టం కన్నా తక్కువ ఎత్తులో పంపు హౌస్‌ల నిర్మాణం జరిగిందనే ఆరోపణ వస్తున్నట్లే పోలవరం వివిధ విభాగాల్లో నాణ్యత ప్రమాణాలు లేక పోవడం బయటపడితే ఏమౌతుంది? 2021లోనే డ్యాం డిజైన్ రివ్యూ పానల్ తన తనిఖీల్లో నాణ్యత ప్రమాణాల గురించి నిలదీయడం అప్పట్లోనే మీడియాలో వచ్చాయి. అత్యంత ఎత్తులో నిర్మిస్తున్న స్పిల్ వే గేట్ల అమరికలో గడ్డర్లు బిగించే తీరుపై డిడిఆర్ పి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ తర్వాత ఈ అంశంపై వార్తలు రాలేదు. అదేవిధంగా ఎగువ కాఫర్ కు వాడే మట్టిలో గట్టితనం లేదని పెద్ద పెద్ద బండ రాళ్లు వేసి కాఫర్ డ్యాంపై పగుల గొట్టడంపై కూడా టీడీఆర్‌పీ అభ్యంతరం చెప్పింది. దాని దుష్పలితం అప్పుడే బయట పడింది. మోతాదుకు మించి సీపేజీ వస్తున్నదనేది పోలవరం ప్రాజెక్టుకు నేడు గుదిబండగా తయారైంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తికాక ముందే వివిధ విభాగాల్లో నాణ్యత ప్రమాణాలు లేకపోవడం బహిర్గతం కావడం కాళేశ్వరం ప్రాజెక్టుతో పోల్చుకొంటే అంతకన్నా కనాకష్టంగా వుంది.

పోలవరం నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలతో పాటు ప్రాజెక్టు ఉనికికే నిధులు గండం తీవ్రంగా వుండబోతోంది. ఎన్నికలు పూర్తయి కేంద్రంలో, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వాలు కొలువు తీరిన తర్వాతే తిరిగి పనులు మొదలౌతాయి. ఒక వేళ రాష్ట్రంలో ప్రభుత్వం మారితే కాంట్రాక్టరు మార్పు తప్పని సరి అవుతుంది. ఒక వేళ తిరిగి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చినా నిధులు గండం తప్పదు. 2017–18 షెడ్యూల్ రేట్ల ప్రకారం తొలి దశకైనా ప్రస్తుతమున్న రేట్ల ప్రకారం ఏ కాంట్రాక్టరు పనులు చేయలేరు. సాధారణంగా పోలవరం ప్రాజెక్టయే కాదు ఏ సాగునీటి పథకమైనా పెరుగుతున్న ధరల మేరకు కనీసం ఏటా 15 శాతం వ్యయం పెరుగుతుంటాయి. ఏ సాగునీటి పథకమైనా నిర్దిష్ట సమయంలో పూర్తి కాకపోతే ఆ మేరకు వ్యయం పెరుగుతూ వుంటుంది. రాష్ట్రంలో పెండింగ్ పథకాలు ఆ మేరకు పెరిగాయి. అంతేకాదు. కొన్ని పథకాల మీద వ్యయం చేసిన మొత్తానికి మించి ప్రస్తుతం నిర్మాణ వ్యయం పెరిగి వుంది. ఈ సూత్రం పోలవరం ప్రాజెక్టుకూ వర్తిస్తుంది. నవాబ్య షరతులతో పోలవరం ప్రాజెక్టు తొలి దశ పూర్తి చేయడానికైనా కేంద్ర ప్రభుత్వం పెరిగిన నిర్మాణ వ్యయం భరిస్తుందా? అదీ 41.15 మీటర్ల ఎత్తు నిర్మాణం గురించే నిధుల గండం వెన్నాడితే 45.72 మీటర్లు ఎత్తు కు పూర్తి స్థాయిలో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి ఎవరు నిధులు ఇస్తారు? పూర్తి స్థాయిలో నిర్మాణం జరగడానికి ఎన్ని ఏళ్లు పడుతుందో? అప్పటికి 2017–18 నాటి షెడ్యూల్ రేట్ల ఏమేరకు పెరుగుతుందో ఊహకు కూడా అందదు. ఒక వేళ టీడీపీ– జనసేన ప్రభుత్వం వచ్చినా నిధుల సమస్య పరిష్కరించడం అసాధ్యం. ఒక్క చిన్న తప్పుతో పోలవరం ప్రాజెక్టు భవితవ్యం ప్రమాదంలోపడింది. 2019 లో అధికారం చేపట్టిన జగన్‌మోహన్ రెడ్డి కాంట్రాక్టరు మార్పు చంద్రబాబు నాయుడును బోనులో నిలబెట్టేందుకు శుల శోధనతో కాలం గడపకుండా నిర్మాణ పనులు కొన సాగించి వుంటే కొంత మెరుగు వుండేది.

విశ్రాంత పాత్రికేయులు
ఫోన్: 848394013

పెరియార్ సచ్చీరామాయణ్ ఒక కనువిప్పు

డాక్టర్ దేవరాజు మహారాజు

సుప్రసిద్ధ నాస్తికవాది, సంఘసంస్కర్త, ద్రవిడ ఉద్యమానికి, ఆత్మగౌరవ ఉద్యమానికి రూపకల్పన చేసిన మహనీయుడు, పెరియార్ ఇరోడ్ వెంకట రామస్వామి నాయకర్ (1879–1973) చేసిన గొప్పపనుల్లో 'కీమాయణం' రాయడం కూడా ఒకటి! ఆయన వాల్మీకి రామాయణానికి 1944లో 'కీమాయణం' అనే పేరుతో అరవై నాలుగు పేజీల వ్యాఖ్యానం ప్రకటించారు. అది వాల్మీకి రామాయణానికి 'హేతుబద్ధమైన విశ్లేషణ'! ఆయన రాసింది తమిళంలో అయితే హిందీ, ఇంగ్లీషు ఇంకా ఇతర భారతీయ భాషల్లో అనువాదాలు వచ్చాయి. అవన్నీ పెరియార్ భావజాలాన్ని ఈ దేశ ప్రజలకు అందించాయి. హిందీలో 'సచ్చీ రామాయణ్' అని, ఇంగ్లీషులో 'రామాయణ: ఎ ట్రూ రీడింగ్' అని, తెలుగులో 'యదార్థ రామాయణం'– అని వచ్చాయి. రామాయణం అందరికీ తెలిసిందే కదా? ఇంకా, మళ్లీ పెరియార్ ఏం రాశారు? అని కొందరికి అనుమానం రావచ్చు. రామాయణాలెందరు ఉంది ? భారతీయ భాషల్లో వివిధ కాలాల్లో రాసిన రామాయణాలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఎవరి స్వబానికష్టతను వారు జోడించి, చిలువలు పలువలుగా రాసుకున్నారు. వేయి పడగలు రాసిన తెలుగు సంప్రదాయకవి విశ్వనాథ సత్యనారాయణ కూడా ఓ రామాయణం రాసి, జ్ఞాన పీఠానికెక్కారు. అయితే, ఇవన్నీ ఒకే మూసలో పోసిన విధంగా... రాముడనే కల్పిత పాత్ర అయిన 'దేవుడి' మీద భక్తి పారవశ్యంలో రాసినవి. వీరంతా వాల్మీకి రామాయణాన్ని మార్చి, అందులో కొత్త సంగతులు చేర్చి రాశారు. రామాయణం రాయనివారు కవే కాదు– అనే అభిప్రాయం గతంలో ఉండేది కూడా!

పెరియార్ నాస్తికుడు కనుక, వాల్మీకి రామాయణంలోని కథను, పాత్రల్ని, ఒక్కొక్కటిగా విశ్లేషించి పాఠకుల కళ్లు తెరిపించాడు. "రామాయణం కల్పిత గాథ" అని స్వయంగా శంకరాచార్యే ప్రకటించారు. ఎందుకూ? అంటే– ఆయన దేవుడు – శంకరుడు. విష్ణు దేవుడి మహిమలు ఆయన ఒప్పుకోడు. ఆ వైరుధ్యం వల్లనే కదా వీరశైవులు, వీరవైష్ణవులు హోరాహోరీ పోట్లాడుకునే వారు? దక్షిణ భారతదేశంలో ఉన్న ద్రావిడుల్ని లొంగ దీసుకోవడానికి, వారిని బానిసలుగా చేసుకోవడానికి ఉత్తరాది నుంచి వచ్చిన ఆర్యులు రాసుకున్న కల్పిత గాథ ఇది! అని డిస్కవరీ ఆఫ్ ఇండియాలో భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ రాశారు. ఈ అభిప్రాయాలన్నింటినీ పెరియార్ తన రచనలో తెలియజేశారు, మరో విషయం కూడా నిర్ధారించారు. మన పంచతంత్రం, అరేబియన్ నైట్స్ కథల్లాగా రామాయణం కూడా కల్పిత గాథే– అని !! వాల్మీకి రామాయణంలో రాముడు దుర్మార్గుడని, మోసగాడని రాస్తే, తర్వాత కాలాలలో వచ్చిన వైదిక మత రచయితలు, అనువాదకులు– రాముడు మంచివాడని సచ్ఛీలుడని మార్చి రాసి, ఆ పాత్రకు దైవత్వం అంటగట్టారని అన్నారు పెరియార్. అసలైతే రామాయణం ధర్మ స్థాపనకు సంబంధించిన రచనే కాదని కూడా కొట్టి పారేశారు.

నిజమనేది ఎప్పుడూ ఒకటే ఉంటుంది. అబద్ధాలు మాత్రమే అనేకం ఉండే ఆస్కారముంది. రామాయణంలోని అబద్ధాలు పరిశీలిస్తే– రామభక్తులే మూర్ఛపోవాల్సిన పరిస్థితి ఉంది. ఉదాహరణకు వాల్మీకి రామాయణం ప్రకారం రాముడి తండ్రి దశరథుడికి 350 మంది భార్యలు. అదే కంభ రామాయణం ప్రకారం ఆయనకు 60 వేల మంది భార్యలు. ఇందులో ఏది నిజం? కైకేయిని వివాహం చేసుకునే సమయంలో దశరథుడు కైకేయి తండ్రికి ఒక వాగ్దానం చేశాడు. అదేమంటే, కైకేయికి పుట్టిన వాడికే పట్టాభిషేకం చేస్తానని! మరి కైకేయి పుత్రుడు భరతుడుండగానే అతనికి పట్టాభిషేకం ఎందుకు చేయలేదు? తన దగ్గరే ఉంచుకుని, పరిపాలనకు సంబంధించిన విషయాలు ఎందుకు నేర్పించలేదు? పైగా కైకేయి తండ్రి పాలించే కేకయ రాజ్యానికి పంపించారెందుకు? రాముడి పట్టాభిషేకం రాదు తీసుకుపోవడానికి భరతుడు అడవికి వెళ్లి రాముణ్ణి కలిసినప్పుడు –స్వయంగా రాముడే భరతుడికి ఈ విషయాలు గుర్తుచేశాడు. (అరణ్య కాండ 107 వ అధ్యాయం) దశరథుడు చేతకానివాడు, శక్తిహీనుడు అయినప్పుడు– మనిషి ఆకారంలో ఒక మాంసం ముద్దగా భావించినప్పుడు.. ఆయనకి నలుగురు కుమారులు ఎలా పుడతారు? పైగా, వారు దృఢకాయులు, సకల గుణ సంపన్నులు ఎలా అవుతారు?భరతుడికే పట్టాభిషేకం చేస్తానని – దశరథుడు వాగ్దానం చేసిన విషయం తెలిసి కూడా– వశిష్టుడు అక్రమంగా 'రామపట్టాభి షేకం' ఎలా జరిపించాడు ? కైకేయి చాలా ధైర్యవంతురాలు. రెండుసార్లు భర్త దశరథుడి ప్రాణాలు కాపాడుతుంది. అందుకు కృతజ్ఞతా పూర్వకంగానైనా దశరథుడు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల్సింది. కానీ, మాట తప్పి, కుట్ర పూరితంగా వ్యవహరించిందేమో కైకేయి కాదు, దశరథుడు! ఆ రకంగా ఇచ్చిన మాటకు విలువ లేకుండా పోయింది. వాల్మీకి రామాయణంలోని అసలైన విషయాల్ని పెరియార్ తన కీమాయణంలో ఎత్తి చూపారు. గాంధీజీ కూడా 'నా రాముడు రామాయణంలో ఉన్న రాముడు కాదు' అని స్పష్టంగా ప్రకటించారు. వాల్మీకి కూడా తన రచనలో రాముడికి దైవత్వాన్ని అంటగట్టలేదు. పెరియార్ మాత్రమేకాదు, ఎందరో పరిశోధకులు, పండితులు, తత్త్వవేత్తలు రాముణ్ణి దేవుడి అవతారంగా భావించలేదు. ఇకపోతే రావణుడు వేదశాస్త్ర పురాణాలను మథించిన గొప్ప పండితుడని మూల రచయిత వాల్మీకి స్వయంగా పొగడిన విషయం పెరియార్ ఎత్తి చూపారు. ఒక బెంగాలీ రామాయణంలో రావణుడు బౌద్ధుడు అని కూడా ఉంది. ఏమైనా బ్రాహ్మణులు యాగాలు చేస్తూ,



సోమరసం తాగుతూ తెక్కలేనన్ని మూగజీవాల్ని బలి ఇవ్వడం ఊరుకుండకొన్ని రావణుడు సహించలేకపోయాడు. ఎందుకంటే, రాజుగా ఆయన చేసిన చట్టాల్ని బ్రాహ్మణులు ఉల్లంఘించారు. యజ్ఞయాగాల పేరిట జంతు బలులు చేస్తూ వచ్చారు. వాటిని ఆపాలనికి వచ్చిన తాటకిని రాముడు చంపాడు. శూద్రుడు ఉండి, శంభుకుడు వేదాలు చదివాడని రాముడు అతనిని చంపాడు. (వాల్మీకి రామాయణం : ఉత్తరాకాండ 75వ అధ్యాయం) మరి ఇన్ని దుర్మార్గాలు కదా? రావణుడు సీతను ఎత్తుకు పోయాడు. అంటే– దానికి ఒక నేపథ్యం ఉంది. రావణుడికి ప్రీతిపాత్రమైన సోదరి శూర్పణఖ. ఆ శూర్పణఖ ముక్కు, చెవులు, స్తనాలు, జుట్టు లక్ష్మణుడు కోసేస్తే – రావణుడు ఊరికే ఉండలేడు కదా? సీతను ఎత్తుకుపోయి, తన అశోక వనంలో అన్ని సౌకర్యాలు కల్పించి ఉంచాడు. సీతని కాదు, రావణుడు అంతకు ముందు ఏ స్త్రీని ఎత్తుకుపోయి అనుభవించిన దాఖలాలు లేవు – అనే విషయం వాల్మీకి రామాయణం: సుందర కాండ 95వ అధ్యాయంలో ఉంది. ఆ విషయాన్నే పెరియార్ వివులంగా వివరించారు. వాస్తవ దృక్కోణంలో ఆలోచించే వారిని దుర్మార్గులుగా – దుర్మార్గంగా ఆలోచించే వారిని సన్మార్గులుగా తర్వాత కాలాలలో వైదిక మతస్థులు చిత్రీకరించి, అబద్ధాలు ప్రచారం చేయడాన్ని పెరియార్ తీవ్రంగా నిరసించారు. అర్ధరాత్రి లంక నగరాన్ని దహించి, అమాయక పౌరుల్ని చంపి రావణం హనుమంతుడి సాహస కృత్యమా? వీరి గొడవలతో లంకలోని సామాన్య ప్రజలకు ఏమిటీ సంబంధం? యుద్ధంలో సుగ్రీవుణ్ణి చంపనని వాలి తన భార్యకు వాగ్దానం చేసి, తమ్ముడికి బుద్ధి చెపుతానని వస్తాడు. మరి సుగ్రీవుడేం చేశాడు? రాముడి శరణుకోరి సొంత అన్నను చంపటంలో సహకరించమని వేడుకున్నాడు. అంటే కుట్ర పన్నాడు. కుట్రలో భాగమైన ధీరోదాత్తుడైన రాముడేం చేశాడు? చెట్టు చాటున నిలబడి వాలిపైకి బాణం వదిలాడు. అది రాముడి సాహస కార్యమా? దొంగదెబ్బ తీయడం వీరుడి లక్షణమా? సరే, ఇది అలా ఉంచి విభీషణుడి సంగతి చూద్దాం ! సోదరుడైన రావణున్ని చంపించి, లంకకు రాజు కావాలనుకుని రాముడికి ఆశ్రయం చేసుకున్న విభీషణుడిది సాహస కార్యమా? ఏముంది రామాయణంలో నీతి, ధర్మం, న్యాయం? కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలు లేనేలేవు. అలాంటప్పుడు ఇది గొప్ప ఉదాత్తమైన రచన ఎలా అవుతుందని పెరియార్ ప్రశ్నించడంలో, నిరసించడంలో న్యాయం ఉంది. వాస్తవాల్ని పక్కన పెట్టి, అభూత కల్పనల్ని నమ్మి భజనలు చేస్తూనే ఉన్నారని ఎవ్వరూ కాపాడలేరు.

బంగారు లేడి ఉండదని తెలిసి కూడా రాముడు దానికోసం ఎందుకు పరిగెత్తాడు?– అని ప్రశ్నించాడు కదా మన వేమన. వాల్మీకి రామాయణంలోని అయోధ్య కాండ 45వ అధ్యాయంలో సీత, లక్ష్మణుని నిందిస్తుంది. "ప్రమాదంలో ఉండి సహాయంకోసం పిలుస్తున్న నీ అన్న రాముడి పిలుపు వినిపించుకోకుండా నువ్వు ఇక్కడే, నా దగ్గరే ఎందుకు తిరుగుతున్నావు? నన్ను అనుభవించాలన్న కోరికతోనా?" అని నిందారోపణ చేస్తుంది! సీత అగ్ని ప్రవేశం చేసి వచ్చినా, రాముడికి ఆమెపై అనుమానం పోదు. సీత పవిత్రురాలని వాల్మీకి చెప్పినా రాముడు నమ్మడు. పైగా గర్భిణిగా ఉన్న సీతను అడవిలో వదిలి రమ్మని లక్ష్మణున్ని ఆజ్ఞాపిస్తాడు. చివరికి ఆమె భూమిలో కూరుకుపోయి ప్రాణాలు వదులుతుంది. ఇలాంటి పనులు దయార్ద్రహృదయుడు, కరుణామయుడు చేయవలసిన పనులేనా? అని పెరియార్ తన వ్యాఖ్యానంలో ప్రశ్నించారు. ఇవే కాదు ఇంకా చాలా చాలా అంశాలు లేవనెత్తారు. అయితే, చెప్పుకోవాల్సిన ముఖ్య విషయమేమంటే– 'కీమాయణం' హిందీలో 'సచ్చీరామాయణ్' పేరుతో ప్రసిద్ధి పొందింది.1967లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం 'సచ్చీ రామాయణ్'ను నిషేధించింది. ఆ నిషేధం చెల్లదని నాలుగేళ్ల తర్వాత 1971లో అలహాబాదు హైకోర్టు కొట్టేసింది. జరిగిన అవమానం చాలని అప్పటి ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం ఊరుకుంటే పోయేది. దాన్ని ఇంకా సాధించి, తాము ఆ పుస్తకాన్ని నిషేధించడం సబబేనని సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకుంది. ఐదేళ్ల తర్వాత 1976లో సుప్రీం కోర్టు తుది తీర్పు చెప్పింది. పెరియార్ కీమాయణం – సచ్చీరామాయణ్– వాల్మీకి రామాయణంపై ఆధారపడి రాసిందేనని, అందువల్ల దాన్ని నిషేధించాల్సిన అవసరం కనబడడం లేదని జస్టిస్ కృష్ణయ్యర్ తీర్పిచ్చారు. ఆ రకంగా పెరియార్ వ్యాఖ్యానం విజయం సాధించింది. పెరియార్ వ్యాఖ్యానం సరైనదేనని, అది అందరూ చదవాల్సిన గ్రంథమని సుప్రీంకోర్టు చెప్పకనే చెప్పినట్టయ్యింది! ఇంకా చెప్పాలంటే వాస్తవాల్ని సుప్రీంకోర్టు బలపర్చినట్లయ్యింది. అబద్ధాలే అధికారం చేజిక్కించుకుంటున్న ఈ కాలంలో.. ఒక విచిత్రం జరిగింది! ఈ దేశానికి అబద్ధాలు 'కేరళ సినిమా' చూపించాలనుకున్న వారికి, ప్రజలు పిడిగుద్దులు గుద్ది 'కర్నాటక సినిమా' చూపించారు కదా? సామాన్య ప్రజలు మేల్కొంటున్నారు. నిజాలు గ్రహిస్తూ, చైతన్యవంతులవుతున్నారు!

కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత,
విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్

రాజకీయాల్లో పెరిగిన ధన ప్రభావం

ప్రజాకవి గోరేటి వెంకన్న

విశాలాంధ్ర-అవనిగడ్డ: ప్రస్తుత రాజకీయాల్లో ధన ప్రభాహం పెరిగిందని, విలువలు మరింత దిగజారాయని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి సభ్యుడు, ప్రజాకవి గోరేటి వెంకన్న ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఆహ్వానం మేరకు శనివారం మండలి స్వగృహానికి విచ్చేసిన వెంకన్న విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియమకాల్లో తప్పితే ఉభయ రాష్ట్రాల ప్రజలు ఒకే తాటిపై ఉండాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీశైలం వద్ద యురేనియం ప్రాజెక్టు నిర్మాణానికి కృషి జరుగుతుందని, అన్ని రంగాల్లో మార్కెట్ ప్రభావం పెరిగిందన్నారు. తెలుగు భాష విధ్వంసానికి కుట్ర జరుగుతోందని, తమిళభాష విధ్వంసం కుట్రలను అంగీకరించని తమిళలు ఉద్యమం ద్వారా ప్రతిఘటించారని గుర్తు చేశారు. అన్ని భాషల జీవన విధానం ఒకటేనని, భావజాలాన్ని ఎవరూ హతమార్చలేరని స్పష్టం చేశారు. క్యూబా, వియత్నాం దేశాల్లో తమమాతృ భాషలోనే వైద్యశాస్త్ర అభ్యాసం జరుగుతుందని తెలిపారు. కార్పొరేట్ శక్తుల పన్నాగాన్ని తిప్పికొట్టడానికి అన్ని భాషల వారు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని వెంకన్న అన్నారు. తెలంగాణ శాసనమండలి సభ్యుడిగా తెలుగు భాషాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ఇప్పటికే సాహిత్య అకాడమీ పేరిట తెలుగు భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నానన్నారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగుజాతి గర్వించతగ్గ మహోన్నత వ్యక్తి గోరేటి వెంకన్న అని కొనియాడారు. ఆయన కవిత్వం విననివారు, చదవనివారు తెలుగు నాట ఉండరన్నారు. గేయ కవిత్వాన్ని తెలుగువారికి అందించిన ఘనత గోరేటి వెంకన్నకే దక్కిందని ప్రశంసించారు. తాను అభిమానించే కవులలో గోరేటి వెంకన్న ఒకరన్నారు. గుర్రం జాషువా, విశ్వనాథ సత్యనారాయణ, బోయి భీమన్న వంటి మహామహులకు చట్టసభల్లో స్థానం దక్కిందని గుర్తుచేశారు. అనంతరం గోరేటి వెంకన్నను మండలి బుద్ధప్రసాద్ దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. మాజీ శాసనసభ్యులు దేవినేని మల్లికార్జునరావు, గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్, దివిసీమ కవి డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్, ప్రముఖ జానపద గాయకులు సూరగం రామకృష్ణ, యాసం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రాంతి విద్యార్థికి నంది పురస్కారం

అభినందించిన పాఠశాల యాజమాన్యం

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగిన నంది నాటకోత్సవాలలో క్రాంతి హైస్కూల్ విద్యార్థి ఉత్తమ నటుడిగా ఎంపికయ్యాడు.నంది అవార్డు దక్కించుకున్నాడు. ఇందుకుగాను ప్రోత్సాహక పారితో షకంగా 25 వేల రూపాయల నగదు అందజేశారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంతకం చేసిన ప్రశంసా పత్రం, పాఠశాలకు జ్ఞాపిక అందజేశారు. నాటికలో ఉత్తమ ప్రదర్శన చేసిన కొడుకు పాత్రధారి రేపాని సంజయ్‌కు ఉత్తమ నటుడి అవార్డుతో పాటు నంది, 12,500 రూపాయల చెక్కు ప్రదానం చేశారు. ఈ అవార్డును ఆంధ్రప్రదేశ్ టెలివిజన్, నాటక రంగ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ పోసాని కృష్ణమురళి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నంది అవార్డులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల యాజమాన్యం శనివారం స్కూల్‌లో సత్కరించింది. ఈనాటి సమాజంలో పిల్లలు పెద్దలను ఏ విధంగా అనుసరిస్తారు, ఏ విధంగా చెడు లక్షణాలు నేర్చుకుంటున్నారు అనే దానిపై రచించిన ఈ నాటిక 'తదాబాల్యం'లో విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారు.

విద్యార్థులను ఉపాధ్యాయులు, ఇతరులు అభినందించారు. నాటిక దర్శకుడు, రచయిత, కవి పీఎస్ఎం, నాటిక ప్రదర్శించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ వెనిగళ్ల మురళీమోహన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీని తరిమికొడదాం

మద్దతు పార్టీలకూ గుణపాఠం తప్పదు

విజయవాడ సదస్సులో వక్తలు

విశాలాంధ్ర- విజయవాడ: భారతరాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడంతో పాటు దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్న మోదీ ప్రభుత్వాన్ని, ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మద్దతిస్తున్న రాజకీయ పార్టీలను ఓడించాలని వక్తలు పిలుపునిచ్చారు. మోదీ హటావో - దేశ్ బచావో నినాదంతో శనివారం విజయవాడ ఎగ్జిబిషన్ కమ్యూనిటీ హాలులో మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వర రావు అధ్యక్షతన సదస్సు జరిగింది. కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా, సామాజిక, గిరిజన, భారత్ బచావో, మేలుకో ఆంధ్రప్రదేశ్‌తో పాటు 72 సంఘాలు, సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. బీజేపీ, దాని మిత్రులను ఓడించడానికి అన్ని శక్తులు కలిసి రావాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ వేదిక నిర్మించడానికి వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులతో జనవరి 12న విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో సభ నిర్వహించాలని, దీనికి జాతీయనాయకులను ఆహ్వానించాలని నిర్ణయించారు. సదస్సులో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ ఎం.గేయానంద్, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, రైతు నాయకులు జెట్టి గురునాథరావు, వామపక్ష పార్టీ నాయకులు సిహెంద్రి ఝాన్సీ, కిషోర్, ఆళ్ల గోపాల కృష్ణ, రమేశ్ పట్నాయక్, సి.భాస్కరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, సీఐటీయూ నాయకులు వి.ఉమామహేశ్వరరావు, కె.ధనలక్ష్మీ, రైతుసంఘం నాయకులు కేవీవీ ప్రసాద్, వై.కేశరరావు, సామాజిక సంఘాల నాయకులు మేళం భాగ్యరాజు, ముప్పాళ్ల సుబ్బారావు, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు నారాయణ, రిటైర్డ్ ఐఏఎస్ బండి శ్రీనివాసరావు, మహిళా నాయకులు రమాదేవి, సి.విజయ, సీతామహాలక్ష్మీ, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం జనవరి 12 సభ జయప్రదం కోసం వడ్డే శోభనాద్రీశ్వరరావు నాయకత్వంలో 43 మందితో కమిటీని ఎన్నుకున్నారు. సదస్సులో నాయకులు మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేయని బీజేపీపై మండిపడ్డారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు మోదీ సర్కారు చేస్తున్న కుటిల ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకించారు. దేశానికి, రాష్ట్రానికి తీవ్ర ద్రోహం చేస్తున్న బీజేపీకి అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ, జనసేన మద్దతుగా నిలవడం అత్యంత బాధాకరమని వ్యాఖ్యానించారు. బీజేపీ, దాని మద్దతు పార్టీలకు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి: లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అగ్రిగోల్డ్ బాధితుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. ప్రతిపక్ష నేతగా హామీఇచ్చి... అధికారంలోకి వచ్చాక అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను విస్మరించారని జగన్‌పై ఆరోపణలు చేశారు. రోడ్డున పడిన అగ్రిగోల్డ్ బాధితులు యువగళం పాదయాత్రలో తనను కలిసి...సమస్యలు విన్నవించారని పేర్కొన్నారు. చనిపోయిన 600 మంది అగ్రిగోల్డ్ బాధితుల కుటుంబాలకు పరిహారం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కనీసం ఆ కుటుంబాలను పరామర్శించలేదని, ఇదేనా మీ మానవత్వం అని నిలదీశారు. అగ్రిగోల్డ్ బాధితుల విషయంలో ప్రతిపక్ష నేతగా జగన్ టీడీపీ ప్రభుత్వంపైనా, తనపైనా చేసిన ఆరోపణలను ఇంకా మర్చిపోలేదన్నారు. నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే అగ్రిగోల్డ్ కుంభకోణం జరిగిందన్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక అగ్రిగోల్డ్ ఆస్తులు 21 ఎకరాలు అటాచ్ చేసి, యాజమాన్యాన్ని అరెస్టు చేయించి బాధితులకు న్యాయం చేశామని గుర్తు చేశారు. అయినా తమపై తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. ఇప్పటికైనా స్పందించి అగ్రిగోల్డ్ బాధితుల డిమాండ్లను పరిష్కరించాలని లోకేశ్ కోరారు.

పది రోజుల్లో సీఆర్‌డీఏ పరిధిలోని

కౌలు రైతులకు బకాయిలు చెల్లించాలి

- లేకుంటే ప్రత్యక్ష ఆందోళనలు
- తుపాను వలన నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

విశాలాంధ్ర-మంగళగిరి: అమరావతి రాజధాని సీఆర్‌డీఏ పరిధిలోని కౌలు రైతులకు గత ఏడాది మే నెల నుంచి బకాయిల మొత్తం తక్షణమే చెల్లించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ముప్పాళ్ల మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేస్తామని చెప్పిన ప్రభుత్వాల మాటలు నమ్మి రైతులు తమ పొలాలను స్వచ్ఛందంగా ఇచ్చారని, గత ప్రభుత్వం, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తూ వారిని కూలీలుగా మార్చేశారని విమర్శించారు. పది రోజుల్లోపు కౌలు రైతులకు ప్రభుత్వం కౌలు చెల్లించని పక్షంలో అఖిలపక్షం అధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని ముప్పాళ్ల హెచ్చరించారు. రాష్ట్రంలో రాక్షసపాలన సాగుతోందన్నారు. మంగళగిరి ఆది నుంచి చేనేత కేంద్రంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలతో పాటు మైనారిటీలు, రైతులను కలిగిన రాష్ట్ర నడిబొడ్డున ఉన్నటువంటి నియోజకవర్గమని అన్నారు. అయితే ఈ నియోజకవర్గంతో పాటు రాజధాని అమరావతిని మరింత అభివృద్ధి చేసి ఈ ప్రాంత రైతాంగానికి కూడా మేలు చేస్తామని చెప్పిన జగన్‌మోహన్ రెడ్డి నిజస్వరూపం ఏమిటో ఇవ్వాళ ఆళ్ల రామకృష్ణారెడ్డి బయటపెట్టారన్నారు. రాజధానిలో రైతుల భూములకు కౌలు చెల్లించడం, రాజధానిలో ఉన్న భూమిలేని పేదలకు రూ.2,500 పెన్షన్‌ను అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.5 వేలు చేస్తామని చెప్పిన జగన్ ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. కౌలు తప్ప ఏ ఆదాయం లేని రైతుల బతుకులు ఎంతటి దారుణంగా ఉంటాయో సీఎం జగన్ తెలుసుకోవాలన్నారు. ఈ నూతన సంవత్సరం ప్రతిపక్ష పార్టీలన్నింటినీ కలుపుకొని అనేక ఉద్యమాలతో ముందుకు వెళతామని ముప్పాళ్ల తెలిపారు. రాజధాని పరిధిలో ఉన్న మంగళగిరి నియోజకవర్గాన్ని సీఎం జగన్ సుమారు రూ.1,200 కోట్లతో అభివృద్ధి చేస్తామని చెప్పి, ఆ తర్వాత రూ.120 కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. రాజధాని ప్రాంతంలో, రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందే తప్ప ఆ కుటుంబాలను ఆదుకోవడం లేదన్నారు. రాష్ట్ర సంపద మొత్తం బడా కార్పొరేటర్లకు కట్టబెడుతోందని, ముఖ్యమంత్రి, అతని అనుచరులు దోచుకుంటున్నారని ముప్పాళ్ల మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ రైతుల ఆత్మహత్యలను నివారించాలంటే వారికి రుణమాఫీ తప్పనిసరిగా జరగాలని, ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెల్లోకి వెళుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుందే తప్ప సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. అంగన్‌వాడీల జీతాన్ని పెంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సీఎం జగన్‌కు బటన్ నొక్కడం తప్పితే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపటం లేదని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కొలికపూడికి ఏపీ సీఐడీ నోటీసులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి నాయకుడు కొలికపూడి శ్రీనివాసరావుకు ఏపీ సీఐడీ నోటీసులు జారీ అయ్యాయి. హైదరాబాద్, మాదాపూర్‌లోని కొలికపూడి ఇంటికి శనివారం సీఐడీ అధికారులు వెళ్లి నోటీసులు ఇచ్చారు. జనవరి 3న విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. ఇటీవల ఛానల్‌లో చర్చావేదికలో పాల్గొన్న కొలికపూడి... 'వ్యూహం' సినిమాపై మాట్లాడుతూ, దర్శకుడు రాంగోపాల్ వర్మ తల నరికి తెస్తే కోటి రూపాయల బహుమతిస్తానన్నారు. దీనిపై ఏపీ డీఐజీ రాజేంద్రనాథ్ రెడ్డికి రాంగోపాల్ వర్మ, నిర్మాత దాసరి కిరణ్ ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదైంది. రంగంలోకి దిగిన ఏపీ సీఐడీ అధికారులు ఆయనను అరెస్ట్ చేసేందుకు హైదరాబాద్ వెళ్లారు. అయితే కొలికపూడి ఇంట్లో లేకపోవడంతో చాలాసేపు ఎదురు చూసిన అధికారులు... ఆయన భార్యకు సమాచారం ఇచ్చారు.

జగన్‌ది మాఫియా పాలన

కాంగ్రెస్‌లోకి షర్మిల: గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి జగన్ మాఫియా పాలన నడిపిస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలపై గిడుగు రుద్రరాజు విరుచుకుపడ్డారు. అవినీతి, అసమ్మతి, సొంత పార్టీ ఎమ్మెల్యేల తిరుగుబాటుతోనే వైసీపీ ప్రభుత్వం కొనసాగిందని విమర్శించారు. ప్రజాస్వామ్య స్ఫూర్తి కొరవడిందని, ఏకపక్ష నిర్ణయాలతో వ్యవస్థలను దిగజార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణంగా ఉద్యోగుల బదిలీలు ఉంటాయని, కానీ వైసీపీ హయాంలో ఎమ్మెల్యేలు, ఎంపీల బదిలీలు కొనసాగుతున్నాయని ఎద్దేవా చేశారు. నీతి, నిజాయతీలకు విలువ లేదని, ఆర్థిక స్థితి ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయడం దారుణమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు జగన్ తీవ్ర అన్యాయం చేశారన్నారు. బీసీలు, దళితులపై సీఎం జగన్ సవతితల్లి ప్రేమ చూపుతున్నారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. ఏపీ కాంగ్రెస్ కొత్త ఇన్‌చార్జి మాణిక్యం ఠాకూర్ జనవరి 8,9 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారని చెప్పారు. తనకున్న సమాచారం మేరకు త్వరలోనే షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరతారని రుద్రరాజు చెప్పారు. షర్మిలతో పాటు పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తామన్నారు. మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డిని త్వరలోనే కలుస్తానని చెప్పారు. ఇప్పటికే సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణతో మాట్లాడామని, భావ సారూప్యత గల పార్టీలు, సంస్థలు, వ్యక్తులతో కలిసి ముందుకు వెళ్తామన్నారు. డీకే శివకుమార్, మాజీ సీఎం చంద్రబాబు మధ్య రాజకీయ చర్చలు జరిగి ఉంటాయని అభిప్రాయపడ్డారు. లౌకిక పార్టీలా? మతోన్మాద పార్టీయా అనేది చంద్రబాబు, జగన్ తేల్చుకోవాలని వ్యాఖ్యానించారు. విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, రాష్ట్ర, నగర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి నిరసన సెగ

గాజువాకలో నాగిరెడ్డికే టికెట్ ఇవ్వాలని అనుచరుల నినాదాలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: వైసీపీలో టికెట్ల కుంపటి రాజుకుంది. కొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇచ్చేది లేదని సర్వేల పేరిట నిరాకరిస్తుం డటంపై ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేల అనుచరులు అగ్గిమీద గుగ్గిలమై మండిపోతున్నారు. విశాఖ జిల్లా గాజువాక ఎమ్మెల్యేగా ఉన్న తిప్పల నాగిరెడ్డికి వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇచ్చేది లేదని అధిష్ఠానం ప్రకటించడంతో శనివారం గాజువాకలో టీఎన్ఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత సమావేశం రసాభాసగా మారింది. వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జ్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి నిరసన సెగ తగిలింది. నాగిరెడ్డి అనుచరులు సుబ్బారెడ్డిని ఘెరావ్ చేశారు. నాగిరెడ్డికి లేదా వారి కుమారులకు టికెట్ ఇవ్వాలని, ఇతరులకు టికెట్ ఇస్తే ఓడించి తీరుతామని కార్యకర్తలు, నాయకులు సుబ్బారెడ్డి ముందే నినాదాలు చేశారు. ఈ పరిస్థితిని, నిరసనలను ఊహించని సుబ్బారెడ్డి పోలీసుల సహాయంతో పరిస్థితిని అదుపులోకి తీసుకు రావాలని ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కార్యకర్తలు, నాయకులు మరింత రెచ్చిపోయారు. నిరసన మధ్య సభ కొనసాగించలేక సుబ్బారెడ్డి వెళ్లిపోయారు. విశాఖ జిల్లాలో వైసీపీ నేతల రాజీనామాల పర్వం ఒక పక్క కొనసాగుతుండగా, మరోపక్క నియోజకవర్గాల మార్పు, టికెట్ల కోసం నిరసనపర్వం కొనసాగుతూనే ఉంది. గాజువాకలో మెజారిటీతో గెలుపొంది, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను సైతం ఓడించిన నాగిరెడ్డికి టికెట్ ఇవ్వకుండా నిరాకరిస్తారా అంటూ కార్యకర్తలు కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో ఊగిపోయారు. నాగిరెడ్డికే మళ్లీ టికెట్ ప్రకటిస్తే కలిసికట్టుగా గెలిపించుకుంటామని, లేదంటే ఎవరు పోటీ చేసిన ఓటమి ఖాయమని తెగేసి చెప్పారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడే ప్రయత్నం చేస్తూ నాగిరెడ్డి కుటుంబానికి సీఎం జగన్ అన్యాయం చేయరని, ఎమ్మెల్సీ కచ్చితంగా ఇస్తారని చెప్పినా కార్యకర్తలు ఊరుకోలేదు. దీంతో నియోజకవర్గ ప్రజల అభిప్రాయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళతానని, టికెట్ వచ్చేలా ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వడంతో రసాభాస సద్దుమణిగింది.

వైసీపీకి తగిన బుద్ధి చెబుతాం

ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: బీసీలను దగా చేస్తున్న వైసీపీకి తగిన బుద్ధి చెబుతామని, ఉత్తరాం ధ్రలో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా దక్కదని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. తనకు ఎన్ని అవమానాలు జరిగినా 14 ఏళ్ల పాటు దిగమింగి వైసీపీ బలోపేతానికి కృషి చేశానని, సీఎం జగన్ చుట్టూ ఉన్న దద్దమ్మ సలహాదారుల వల్లే తనకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీ వల జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో వంశీ కృష్ణ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. శనివారం విశాఖలో హోటల్ మేఘాలయలో నిర్వహించిన మీడియా సమావేశంలో వంశీ కృష్ణ మాట్లాడుతూ సీఎం జగన్ నమ్మించి బీసీలను నట్టేట ముంచారని, 14 ఏళ్లు రాత్రి, పగలు రోడ్లపై పడుకుని పార్టీని కాపాడితే తనను ముఖ్యమంత్రి కలవడానికి కూడా ఇష్టపడకపోవడం తీవ్ర ఆవేదనకు గురి చేసిం దన్నారు. మేయర్ పదవి ఆశ చూపి కార్పొరేటర్‌గా పోటీలో దింపి, ఓటమికి ఎన్నో ప్రయత్నాలు చేసినా, గెలిచి వచ్చిన తర్వాత మేయర్ పదవి ఇవ్వకుండా మొఖం చాటేసారని మండిపడ్డారు. నన్ను రెచ్చగొట్టారని, రిటర్న్ గిఫ్ట్ ఇస్తానని వంశీకృష్ణ మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా తనపై విమర్శలు చేస్తున్నా రని, అందుకే మీడియా సమావేశం పెట్టానన్నారు. వైసీపీలో బీసీలను బాగా చూస్తే తామంతా ఎందుకు బయటకు వస్తామన్నారు. జగన్‌ను బూతులు తిట్టిన వారే ఇప్పుడు మంత్రులుగా ఉన్నారని, ఉత్తరాంధ్రలో వైసీపీ పదవులు వేసింది ఏయూ మాజీ వీసీ ప్రసాద్ రెడ్డి అని అన్నారు. పార్టీ మారేందుకు 10 మంది ఎమ్మెల్సీలు, 30 మంది కార్పొరేటర్లు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. త్వరలోనే విశాఖ నుంచి జనసేనలోకి భారీగా చేరికలు ఉంటాయ న్నారు. తనను విశాఖ పార్లమెంటుకు, గాజువాక నుంచి పోటీ చేయమన్నా రని, తాను చేయనని చెప్పానన్నారు. తాను అడిగిన సీటు జనసేన ఇస్తుందని ఆశిస్తున్నట్లు వంశీకృష్ణ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జనసేన నేతలు శివశంకర్, మూర్తి యాదవ్ పాల్గొన్నారు.

జగన్‌తోనే సామాజిక సాధికారత

డిప్యూటీ సీఎంలు అంజాద్ బాషా, నారాయణస్వామి

విశాలాంధ్ర-నంద్యాల: సీఎం జగన్‌తోనే రాష్ట్రంలో సామాజిక సాధికారత సాధ్యమని, బడుగు, బలహీన వర్గాలకు విద్య, సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థాయిని పెంచారని ఉప ముఖ్యమంత్రులు అంజాద్ బాషా, నారాయణ స్వామి అన్నారు. నంద్యాలలో సామాజిక సాధికారత యాత్ర సందర్భంగా పట్టణంలోని సూరజ్ గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు. అంజాద్ బాషా మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు అయ్యాయని, కానీ ఇప్పటి వరకు సామాజిక సాధికారత అన్నది ఒక నినాదంగానే మిగిపోయిందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో విద్యా సాధికారత కోసం విప్లవాత్మక మార్పులు తెచ్చారని, నాడు-నేడు, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ దీవెన వంటి పథకాలను అందించారని తెలిపారు. నవరత్నాలు పేరిట సంక్షేమ పథకాలు అమలు చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఆర్థిక స్థాయిని పెంచారని అన్నారు. కుల, మత, పార్టీలకు, ప్రాంతాలకతీతంగా పారదర్శకతతో సంక్షేమ పథకాలు గడపగడపకు చేరేలా చేశారని చెప్పారు. మహిళల స్వావలంబన కోసం అనేక పథకాలు తీసుకొచ్చారని, అన్నింటా వారికి 50 శాతం భాగస్వామ్యం కల్పించారన్నారు. వీటన్నిటిని ప్రజలకు తెలిపేందుకు సామాజిక సాధికార బస్సు యాత్ర చేపడుతున్నామని తెలిపారు. నంద్యాలలో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. నారాయణస్వామి మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు వైసీపీ ప్రభుత్వం ముందుకు వస్తే టీడీపీ నాయకులు కోర్టులకు వెళుతూ అడ్డుతగులుతున్నారని తెలిపారు. చంద్రబాబు నాయుడు 14 ఏళ్లు అధికారంలో ఉన్నా పేదలకు చేసిందేమీలేదన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నంద్యాల జిల్లా సమన్వయకర్త ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు హబిబుల్లా, ఏపీ మార్కెఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డా.శశికళరెడ్డి, బెస్త సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, ఎంపీపీ శెట్టి ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు.

వైసీపీలో ఒక్కరూ ఉండరు

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: వైసీపీ నేతలందరికీ ఓటమి భయం పట్టుకుందని, వచ్చే ఎన్నికల్లో మునిగిపోయే నావలో ఉండలేక అందరూ బయటకు వస్తున్నారని విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ తర్వాతే వైసీపీలో అసలైన ముసలం మొదలవుతుందని తెలిపారు. రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయని, జగన్ ఎటు ప్రయాణం చేస్తున్నాడో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. సీఎం జగన్ మానసిక వ్యాధితో జగన్ బాధపడుతున్నారని అన్నారు. అమలుకు వీలుకాని హామీలతో అధికారంలోకి వచ్చాడని, 99.9 శాతం హామీలు అమలు చేశానని బూటకపు మాటలు చెబుతున్నాడని తెలిపారు. రాజధాని అమరావతికి తూట్లు పొడిచాడన్నారు. విశాఖ కార్యనిర్వాహక రాజధాని అని ఒక్క ఇటుక కూడా వెయ్యలేదని, కర్నూలు న్యాయ రాజధాని అని విస్మరించాడన్నారు. టీడీపీ హయాంలో పోలవరం 74 శాతం పూర్తయిందని, వైసీపీ హయాంలో 4 శాతం కూడా అవ్వలేదన్నారు. వైసీపీ ఘన కార్యాన్ని ఆ పార్టీ నుంచి బయటకొచ్చిన విశాఖలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ, సీతంరాజు సుధాకర్ కథలు కథలుగా చెబుతున్నారన్నారు. భవిష్యత్తుల్లో మరింతమంది వైసీపీ నుంచి బయటకు వస్తారని గంటా తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ జగన్‌పై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, టీడీపీ-జనసేన ప్రభుత్వం రానుందని చెప్పారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి లోడగల కృష్ణ, ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ చిక్కాల విజయబాబు, పాడుగు కుమార్, నడిగట్ల శంకరరావు, కోనేటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం జనాభాపై అపోహలు రాజకీయ కల్పితాలే

- మాజీ సీఈసీ ఖురేషీ
- పథకం ప్రకారమే ఎంపీల బహిష్కరణ: కె.నారాయణ
- మైనార్టీల పట్ల ప్రభుత్వాల వైఖరి మారాలి: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ:
ముస్లిం జనాభాపై అపోహలు రాజకీయ కల్పితాలేనని, స్వాతంత్ర్యానంతరం దేశంలో ముస్లింల జనాభా విపరీతంగా పెరుగుతుందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని భారత మాజీ ప్రధాన ఎన్నికల అధికారి ఎస్వై ఖురేషి అన్నారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవంలో మూడవ రోజు శనివారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య వేదికపై జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఖురేషి తాను రాసిన 'జనాభా సంఖ్య-అపోహలు-భారత రాజకీయాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలలో ఎక్కువ మంది పిల్లలను కంటారనీ, ఎక్కువ పెళ్లిళ్లు చేసుకుంటారనే దాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం గోరంతలు కొండంతలు చేసి చూపుతున్నారన్నారు. జనాభాలో మహిళల సంఖ్య పురుషుల సంఖ్య కన్నా తక్కువగా ఉన్నప్పుడు ఒకరు ఎక్కువ మందిని పెళ్లిచేసుకోవడం సాధ్యమే కాదన్నారు. అలాగే ముస్లింలలో కుటుంబ నియంత్రణ నిషేధమనే మాట కూడా నిజం కాదన్నారు. భార్యాపిల్లలను పోషించే ఆర్థిక సామర్థ్యం లేనప్పుడు పెళ్లి చేసుకోవద్దని కూడా ఖురాన్ చెప్పిందన్నారు. కుటుంబ నియంత్రణను మహ్మద్ ప్రవక్త సమర్థించారన్నారు. ఇరాన్, బంగ్లాదేశ్, మలేషియా లాంటి పూర్తి ముస్లిం దేశాలలో కుటుంబ నియంత్రణ సమర్థంగా అమలవుతుందోన్నారు. కుటుంబ నియంత్రణ, జనాభా నియంత్రణ విషయంలో మతాల ప్రభావం కంటే అక్షరాస్యత, ఆర్థిక స్థితి, స్థానిక సంస్కృతుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని శాస్త్రీయ అధ్యయనంలో నిరూపితమైందన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ దేశంలో అన్ని సామాజికవర్గాలకంటే ముస్లిం ఆర్థిక పరిస్థితి చాలా తక్కువగా ఉందని సచార్ కమిటీ తదితర అధికారిక అధ్యయనాలలో వెల్లడయ్యిందన్నారు. అనవసర అపోహలతో ప్రజల మధ్య అంతరాలు పెంచుకోవడం అనవసరమని తెలిపారు.

సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల కమిషన్‌తో అన్ని వ్యవస్థలను ప్రభావితం చేస్తోందన్నారు. అలాంటి దుష్ప్రభావాలను అడ్డుకునేందుకు ఖురేషీ చేసిన అధ్యయనాలు ఉపయోగపడతాయన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకునేందుకు సామాజిక చైతన్యం గల పౌరులందరూ వాస్తవాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఒక పార్టీ నుంచి గెలుపొందిన అభ్యర్థి మరో పార్టీలోకి వెళ్లినప్పుడు అతన్ని పదవి నుంచి ఎందుకు తొలగించటం లేదని, ఎన్నికల తనిఖీల్లో పట్టుకున్న డబ్బుకు సంబంధించిన వారిపై ఎందుకు కేసులు పెట్టటం లేదని సందేహం వెలిబుచ్చారు. జనవరి 22న అయోధ్య రామమందిరాన్ని ప్రారంభించటం ద్వారా సార్వత్రిక ఎన్నికల్లో ఉపయోగపడుతుందనే దురుద్దేశంతోనే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పథకం ప్రకారం చేస్తోందని విమర్శించారు. బీజేపీ ఉద్దేశపూర్వకంగా యువకుల ద్వారా పొగబాంబులను పార్లమెంటులోకి పంపించి, ప్రతిపక్షాలను రెచ్చగొట్టి, వారిని బహిష్కరించి కీలక బిల్లులను ఆమోదించుకుందన్నారు. కేంద్రంలో క్రిమినల్ ప్రభుత్వం పని చేస్తోందని ఘాటుగా విమర్శించారు.

విశాలాంధ్ర సంపాదక మండలి అధ్యక్షులు కె.రామకృష్ణ మాట్లాడుతూ సచార్ కమిటీ నివేదిక వచ్చిన తర్వాతే ముస్లింల స్థితిగతులు, విద్య, ఉపాధి అవకాశాల గురించి ప్రపంచానికి తెలిసిందన్నారు. ఎన్నో శాస్త్రీయ అధ్యయనాలు వాస్తవాలను పేర్కొంటున్నా మైనారిటీల పట్ల ప్రభుత్వాల వైఖరి మారడం లేదన్నారు. రాజ్యాంగంలోని లౌకిక విలువలను కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ నాశనం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్‌లతో కలిసి పని చేయటం ద్వారా రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. ఉత్తర ప్రదేశ్‌లో 18 శాతం ముస్లింలు ఉన్నప్పటికీ, ఒక్క ఎమ్మెల్యే సీటు కేటాయించలేదని, పైగా ముస్లింలకు ఇవ్వబోమని చెప్పటం నియంతృత్వానికి నిదర్శనం అన్నారు. ప్రజాస్వామ్య వాదులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు గద్దం కోటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జనరల్ మేనేజర్ పి.హరినాథ్‌రెడ్డి, మక్బూల్ అహ్మద్ నక్వీ, గని తదితరులు పాల్గొన్నారు. ఖురేషి ప్రసంగాన్ని ఎంఎస్ ఇమామ్ బాషా తెలుగులో అనువాదం చేశారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు వందన సమర్పణ చేశారు.

సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో అరసం, విశాలాంధ్ర కృషి ప్రశంసనీయం

పెనుగొండ లక్ష్మీనారాయణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం:
సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో అభ్యుదయ రచయితల సంఘం (అరసం), విశాలాంధ్ర కృషి ప్రశంసనీయమని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. గుంటూరులో విశాలాంధ్ర 23వ పుస్తక మహోత్సవం సందర్భంగా స్థానిక లాడ్జిసెంటర్ ఏఎల్ బీఈడీ కళాశాల ప్రాంగణం, అభ్యుదయ సాహిత్యోద్యమ నేత డాక్టర్ ఆవంత్స సోమసుందర్, నయాగరా కవి, నాటక రచయిత, అనువాదకులు బెల్లంకొండ రామదాసు శతజయంతి సాహిత్యవేదిక నందు బహుమతి ప్రదానోత్సవ సభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అభ్యుదయ రచయితల సంఘం ప్రగతిశీల సాహిత్యాన్ని సృష్టిస్తుంటే విశాలాంధ్ర ప్రగతిశీల సాహిత్యాన్ని ప్రచురిస్తుందన్నారు. సృజన, సృష్టి కలిసినప్పుడే మంచి సాహిత్యం వెలువడుతుందని చెప్పారు. మంచి పుస్తకాన్ని ప్రజల వద్దకు చేర్చడానికి ఉన్న అన్ని మార్గాలను అరసం, విశాలాంధ్ర అన్వేషిస్తున్నాయని తెలిపారు. పుస్తక మహోత్సవాలు, పుస్తక పరిచయ సభలు, విద్యార్థులకు పోటీలను అరసం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 23 సంవత్సరాలుగా పుస్తక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పెనుగొండ లక్ష్మీనారాయణ తెలిపారు. కన్న విద్యాసంస్థల అధినేత కన్న మాస్టార్ మాట్లాడుతూ పుస్తక బాండాగారం అంటే పుస్తక సముద్రం అని అన్నారు. జనరల్ పుస్తకాలు చదివితే జ్ఞానం పెరుగుతుందన్నారు. ఎవరైతే టెక్స్ట్ బుక్స్ చదువుతారో వారు ఏ శిఖరానైన్నా అధిరోహించగలరన్నారు. పుస్తకాలు చదవటం వలన పోటీ పరీక్షల్లో రాణించవచ్చని తెలిపారు. పుస్తకాలు అందుబాటులో ఉంటే పిల్లలు ఏదో ఒకరోజు వాటిని చదవటానికి ప్రయత్నిస్తారని, కొత్త సంవత్సరం కానుగా ఇళ్లల్లో పుస్తకాల ర్యాక్‌ను ఏర్పాటు చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. సభకు అధ్యక్షత వహించిన అరసం జిల్లా కార్యదర్శి బుల్లా రవిబాబు మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్నప్పటికీ తెలుగుపై మక్కువతో పిల్లలకు మంచి తర్ఫీదిచ్చి విజేతలుగా నిలపడంతో వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర గణనీయమైందన్నారు. అనంతరం పుస్తక మహోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రముఖ రచయిత గోవిందరాజుల మాధురి, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శరశ్చంద్ర జ్యోతిశ్రీ, విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్ మురకొండ మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

నా అవార్డులు వెనక్కి

- కర్తవ్యపథ్‌పై వదిలేసిన వినేశ్ ఫొగాట్
- ప్రధాని మోదీకి లేఖలో ఆవేదన

న్యూఢిల్లీ:
తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తి అనుచరుడికి కీలక బాధ్యతలు అప్పగించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ తన జాతీయ అవార్డులను వెనక్కిచ్చేశారు. దిల్లీలోని కర్తవ్య పథ్ పేవ్‌మెంట్‌పై వాటిని వదిలేశారు. అర్జున, ఖేల్ రత్న అవార్డులను ఆమె శనివారం త్యజించారు. వాటిని ప్రధానమంత్రి కార్యాలయం ఎదుట వదిలడానికి ఆమె తొలుగ ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అవార్డులను కర్తవ్య పథ్ పేవ్‌మెంట్‌పై వదిలిపెట్టారు. ఫొగాట్ ఇటీవల ప్రధాని మోదీకి ఓ లేఖ రాయడం, అవార్డులు వెనక్కి ఇస్తున్నట్లు తెలపడం తెలిసిందే. 'నేను నా మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న, అర్జున అవార్డును తిరిగి ఇస్తున్నా' అని చెబుతూనే ప్రధానికి రాసిన రెండు పేజీల లేఖలో ఆవేదనను వెలిబుచ్చారు. 'సాక్షి మాలిక్ రెజ్లింగ్ నుంచి తప్పుకున్నారు. బజరంగ్ పునియా తన పద్మశ్రీని తిరిగిచ్చేశారు. ఇందుకు గల కారణాలు ఏంటో దేశం మొత్తానికి తెలుసు. ఈ దేశానికి నాయకుడిగా మీకు కూడా ఈ విషయాలు తెలిసే ఉంటాయి. నేను వినేశ్ ఫొగాట్. మీ దేశపు ఆడబిడ్డను. ఏడాదిగా నేను పడుతున్న ఆవేదనను తెలియజేయడానికే ఈ లేఖ రాస్తున్నా. 2016లో సాక్షి ఒలింపిక్ మెడల్ గెలిచిన రోజు నాకు ఇప్పటికీ గుర్తుంది. మీ ప్రభు త్వం ఆమెను బేటీ బచావో బేటీ పఢావోకు బ్రాండ్ అంబాసిడర్‌ను చేసింది. దీంతో ఎంతో సంతోషించా. రెజ్లింగ్ నుంచి తప్పుకుంటున్నట్లు సాక్షి ఇటీవల ప్రకటించారు. మహిళా అథ్లెట్లు... ప్రభుత్వ ప్రకటనల్లో కనిపించడానికే ఉన్నామా? ఒలింపిక్ పతకం గెలవాలని లక్ష్యం ఉండేది కానీ తాజా పరిస్థితుల్లో అది ఓ కలగానే మిగిలింది. మీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఫ్యాన్సీ ఫ్లెక్సీలు ఫేడ్ అవుట్ అయ్యాయి. మమ్మల్ని అణగదొక్కాలని చూసిన వ్యక్తి ఈ ఆటలో తాను లేకున్నా ఆటను శాశిస్తానని బహిరంగంగానే చెప్తున్నారు' అని మోదీకి రాసిన లేఖలో ఫొగాట్ పేర్కొన్నారు.

8 కోట్లు దాటిన ఐటీ రిటర్నులు

న్యూఢిల్లీ:
గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2023-24 మదింపు సంవత్సరంలో రికార్డు స్థాయిలో ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలైనట్లు ఐటీ శాఖ వెల్లడించింది. ఇప్పటి వరకు 8 కోట్ల మందికి పైగా రిటర్నులు దాఖలు చేశారని ఆదాయపు పన్ను విభాగం తెలిపింది. 2022-23 మదింపు సంవత్సరంలో మొత్తం 7,51,60,817 రిటర్నులు దాఖలయ్యాయని అధికారిక 'ఎక్స్' ద్వారా ప్రకటించింది. దీంతో ఐటీశాఖ సరికొత్త మైలురాయిని చేరుకుందని వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీఆర్ ఫైల్ చేయని వారు 'బిలేటెడ్ ఐటీఆర్' ఫైల్ చేసే అవకాశం ఉంటుంది. దీనికి ఆఖరు తేదీ డిసెంబర్ 31. ఇప్పటికే ఐటీఆర్ ఫైల్ చేసిన వారు అందులో ఏవైనా తప్పులుంటే ఈ తేదీలోపు తిరిగి రివైజ్డ్ రిటర్న్ ఫైల్ చేసి సరిదిద్దుకోవడానికి వీలుంది. తప్పులు సరిదిద్దుకోకపోతే భవిష్యత్‌లో నోటీసులు అందుకునే అవకాశం ఉంటుంది. రివైజ్డ్ రిటర్నులు దాఖలు చేసేందుకు ఎలాంటి ఆలస్య రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు.

ఏపీ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

జమలయ్య పిలుపు

విశాలాంధ్ర-భీమవరం:
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 18వ రాష్ట్ర మహాసభలు జనవరి 8, 9, 10వ తేదీల్లో రాజమండ్రిలో జరగనున్నాయని, వీటిని జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య పిలుపునిచ్చారు. రైతు సంఘం పశ్చిమగోదావరి జిల్లా మహాసభ శనివారం పాలకోడేరు సాయిబాబా గుడి ఆవరణలో జరిగింది. మహాసభకు కలిశెట్టి వెంకట్రావు, గంజి రాజు, ఎం.లక్ష్మీపతి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన జమలయ్య మాట్లాడుతూ రైతు సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా జనవరి 8న భారీర్యాలీ, బహిరంగ సభ, 9, 10వ తేదీల్లో ప్రతినిధుల సభలు జరుగుతాయన్నారు. రైతాంగ సమస్యలపై ప్రతినిధులు చర్చించి, పోరాట కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. రైతు మేనిఫెస్టో రూపొందిస్తామన్నారు. 1926లో ఏర్పడిన అఖిలభారత కిసాన్ సభ రైతాంగం పక్షాన అలుపెరుగని పోరాటాలు చేసిందని ఆనాడే రైతుల హక్కుల కోసం బ్రిటీష్ వారినే గడగడలాడించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం జరుగుతున్న రైతుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలన్నారు. పాలకులే వీటికి బాధ్యత వహించాలని జమలయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాలు దళారీ పాత్రను పోషిస్తున్నాయని, మొన్న తుపాను గురించి ముందస్తు హెచ్చరికలు వచ్చినా ప్రభుత్వం సమాయత్తం కాలేదని, కనీసం టార్పాలిన్లు, గోనె సంచులను రైతులకు సమకూర్చలేదన్నారు. కొత్త లాండ్ టైట్లింగ్ చట్టం రియల్ మాఫియాకు వరమని విమర్శించారు. మన భూములపై మనకు హక్కు లేకుండా ఈ చట్టం చేస్తుందని జమలయ్య దుయ్యబట్టారు. పంట సాగుదారుల చట్టంతో కౌలు రైతులకు లాభం చేకూరబోదని, దానిని సవరించాలని డిమాండ్ చేశారు. అంపశయ్యపై ఉన్న రైతాంగం తరపున పోరాడాలంటే గ్రామ గ్రామాన రైతు సంఘం విస్తరించాలని పిలుపునిచ్చారు. ఆ దిశగా నాయకత్వం ముందుకు సాగాలని జమలయ్య దిశానిర్దేశం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లా డుతూ మొన్నటి వరకు 19 జిల్లాలో వర్షాభావంతో కరువు ఏర్పడితే చర్యల్లేవన్నారు. రైతులు, రైతు కూలీలు వలసపోతున్నా ప్రభుత్వం నిద్రవీడలేదని విమర్శించారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని మోసపూరిత ప్రకటనలు చేసిందని, కనీస మద్దతు ధరకు కొనుగోలు జరగలేదని ఆరోపించారు. రైతుల పక్షాన పోరాటాల నిర్మాణం జరగాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాంప్రసాద్, చెల్లబోయిన రంగారావు, సమితి సభ్యులు నామాన వెంకటేశ్వర రావు, గంజి రాజు, వైవీ ఆనంద్, సనపల శ్రీనివాస్, మల్లుల శ్రీనివాస్, కోన గొల్లయ్య, కర్రి, సూరిబాబు, మండల నాగేశ్వరరావు, యు.జయకృష్ణ పాల్గొన్నారు.

సనాతన ధర్మం రాజ్యాంగ విరుద్ధం

- డీహెచ్‌పీఎస్ సదస్సులో వక్తలు
- రాజ్యాంగ రక్షణకు సమష్టిపోరు: దివాకర్‌బాబు
- ఐక్యతతోనే బీజేపీని ఓడిద్దాం: జల్లి విల్సన్

విశాలాంధ్ర-విజయవాడ:
సనాతనధర్మం భారత రాజ్యాంగ విలువలకు పూర్తి వ్యతిరేకమని వక్తలు ఉద్ఘాటించారు. దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) అధ్వర్యంలో 'భారత రాజ్యాంగ రక్షణ- మన కర్తవ్యం' అనే అంశంపై డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ అధ్యక్షతన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం సదస్సు జరిగింది. ప్రధానవక్తగా పాల్గొన్న సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెన్నుపాటి దివాకర్‌బాబు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగానికి విరుద్ధంగా పాలన సాగుతోందన్నారు. సనాతన ధర్మం బహుజనుల జీవన విధానానికి వ్యతిరేకంగా ఉంటుందన్నారు. సనాతనధర్మం భారతీయ ధర్మం కానేకాదన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఒక వ్యక్తికి సామాజిక గౌరవం అతని కులంపై ఆధారపడి ఉంటుందన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం వ్యక్తికి సమాన హక్కులు, బాధ్యతలు, అవకాశాలు ఉంటాయన్నారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక సమానత్వం ఉంటుందన్నారు. దీనిని ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభలు వ్యతిరేకించాయని గుర్తు చేశారు. రాజ్యాంగం ప్రకారం రాజ్యం అన్ని మతాల పట్ల సమభావం కలిగి ఉంటుందన్నారు. పాలన చట్ట ప్రకారం ఉండాలి తప్ప వ్యక్తిగతం కాదన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికల్లో ఓటు వేయటం మాత్రమే కాదని... విధానపరమైన నిర్ణయాల్లో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని స్పష్టంచేశారు. రాష్ట్రాలు బలంగా ఉంటేనే దేశం పటిష్టమని, సమాఖ్య స్ఫూర్తి ఉంటుందని పేర్కొన్నారు. దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చితే అసమానతలు మరింత పెరుగుతాయని, హిందువులందరూ సమానం కాదని చెప్పారు. మానవ వనరుల అభివృద్ధిలో మనదేశం 129వ స్థానంలో ఉందన్నారు. విద్య, వైద్యం బాగుంటేనే మానవ వనరులు అభివృద్ధి సాధ్యమని చెప్పారు. పార్లమెంటులో చర్చించి స్టాండింగ్ కమిటీ సూచనలు పరిగణనలోకి తీసుకున్న తరువాతే చట్టాలు చేయాల్సి ఉందన్నారు. 149 పార్లమెంటు సభ్యులను బహిష్కరించి కీలక చట్టాలు రద్దు చేసి...కొత్త చట్టాలు తీసుకురావడం ఏ తరహా ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. 50 శాతం ప్రజల సంపద కేవలం ఒక్క శాతం గల సంపన్నుల వద్ద ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 3 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, రిజర్వేషన్లు అమలు చేయకుండా ఉండేందుకు వాటిని భర్తీ చేయటం లేదన్నారు. ప్రైవేటు సంస్థలకు ప్రభుత్వం రాయితీలు ఇవ్వటంతో పాటు సహజ వనరులు అప్పగిస్తున్నదని, అందువల్ల ప్రైవేటు సంస్థల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించటం, ముఖ్యమైన వాటికి మతపరమైన పేర్లు పెట్టడం ఎంతమాత్రం సమర్ధనీయం కాదన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవటానికి దళిత, గిరిజన, బహుజనులు, పేదలు నడుం కట్టాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్...సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలను జాతీయస్థాయిలో చర్చకు దారితీసిందన్నారు. ఇలా మాట్లాడేవారికి మద్దతు ఇవ్వాలన్నారు. ఇండియా కూటమిలోని 28 పార్టీలు ఐక్యంగా పోరాడితే బీజేపీని ఓడించటం సాధ్యమేనని స్పష్టంచేశారు. బీజేపీని ఇంటికి పంపటానికి ప్రజాస్వామ్య, లౌకికశక్తులు ముందుకు రావాలనాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ మరలా అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి ప్రమాదం తప్పదని హెచ్చరించారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేయటానికి విస్తృత ప్రచారం చేయాల్సి ఉందన్నారు. జిల్లాస్థాయిలో డీహెచ్‌పీఎస్‌ను బలోపేతం చేయాలని సూచించారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం పరివర్తిన చెందిన సమాజ నిర్మాణానికి అవసరమైన విప్లవ ప్రణాళిక అని అన్నారు. రాజ్యాంగ సవరణ, చట్ట సవరణలు చేస్తున్నప్పటికీ వాటిని సక్రమంగా అమలు చేయటం లేదన్నారు. అట్రాసిటీ కేసుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వకూడదని, కానీ స్టేషన్ బెయిల్ ఇస్తున్నారని చెప్పారు. మార్కెట్ యార్డు, సహకార సంఘం వంటి సంస్థల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. మానవహక్కుల పరిరక్షణ సొసైటీ నాయకులు గద్దల ఆదాం, ఎస్సీ, ఎస్టీల ఐక్యవేదిక నాయకులు తిప్పాబత్తిన గోవింద్, రెల్లిసంఘం నాయకులు శీరంశెట్టి నాగేంద్ర ప్రసంగించారు. సామాజిక కార్యకర్త బూదాల జోసెఫ్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి, ఎంఆర్‌పీఎస్ ఉభయ రాష్ట్రాల కన్వీనర్ పేరుపోగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప అతిథులకు స్వాగతం పలికారు. విజయవాడ నగర అధ్యక్షులు సంగుల పేరయ్య వందన సమర్పణ చేశారు.

షర్మిల వెంట నడుస్తా...

వైసీపీకి సిద్ధాంతాలు లేవు: ఆర్కే



విశాలాంధ్ర-మంగళగిరి:
తాను వైఎస్సార్ కుటుంబానికి సన్నిహితుడనని, వైఎస్ షర్మిల వెంట నడుస్తానని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ప్రకటించారు. షర్మిల ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు కట్టుబడి ఉంటానని తెలిపారు. ఇప్పటికే షర్మిలను కలిసినట్లు చెప్పారు. వైసీపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన తర్వాత తొలిసారి మంగళగిరి వచ్చిన ఆయన శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సిద్ధాంతాలు లేవని విమర్శించారు. మంగళగిరి అభివృద్ధికి మంజూరు చేసిన రూ.1200 కోట్లలో నుంచి రూ.120 కోట్లు మాత్రమే వచ్చాయన్నారు. చేసిన పనులకు బిల్లులపై కాంట్రాక్టర్ల ఒత్తిడి మేరకు అనేకసార్లు సీఎంఓ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. స్వయంగా రూ.8 కోట్లు అప్పు తెచ్చి కాంట్రాక్టర్లకు చెల్లించినట్లు తెలిపారు. దుగ్గిరాల మండలానికి రూ.50కోట్లు కేటాయించమంటే నిధులు ఇవ్వలేదని చెప్పారు. లోకేశ్‌ను ఓడించినాగానీ తనకు పార్టీ నుంచి సహకారంలేదని ఆర్కే ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ నిధులు రాకపోవడంతో ఆందోళనకు గురైనట్లు తెలిపారు. మంగళగిరి ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని అన్నారు. తప్పు ఎవరు చేసినా తాను కోర్టులకి వెళ్లి న్యాయం కోసం పోరాటం చేస్తానని చెప్పారు. జగన్‌మోహన్ రెడ్డి తప్పు చేసినాగానీ ఆయనపై న్యాయపోరాటం చేస్తానన్నారు. సీఎంకి గంజి చిరంజీవి మధ్య ఏమి జరిగిందో తనకు తెలుసని ఆర్కే అన్నారు. చంద్రబాబుపై కేసుల్లో న్యాయపోరాటం కొనసాగుతుందని చెప్పారు.

హఫీజ్ సయీద్‌ను అప్పగించం: పాక్

ఇస్లామాబాద్:
కరడుగట్టిన అంతర్జాతీయ ఉగ్రవాది, లష్కరే తోయిబా నేత హఫీజ్ సయీద్‌ను భారత్‌కు తీసుకొచ్చేందుకు కేంద్రం చేపట్టిన చర్యలు సఫలమయ్యేలా కనిపించడం లేదు. హఫీజ్‌ను తమకు అప్పగించాలని కేంద్రం ఇటీవల పాకిస్థాన్‌ను అధికారికంగా కోరింది. తమ అభ్యర్థనను ఇస్లామాబాద్‌కు పంపినట్లు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి వెల్లడించారు. దీనిపై పాక్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ముంతాజ్ జహ్రా బలోచ్ తాజాగా స్పందించారు. మనీలాండరింగ్‌కు సంబంధించిన కేసులో హఫీజ్ సయీద్ అప్పగింత కోసం భారత అధికారుల నుంచి అభ్యర్థన అందిందని, అయితే, రెండు దేశాల మధ్య ద్వైపాక్షికంగా ఖైదీల అప్పగింత ఒప్పందం అనేది లేదని ముంతాజ్ ఓ ప్రకటనలో వెల్లడించినట్లు డాన్ పత్రిక తెలిపింది. దీంతో హఫీజ్‌ను భారత్‌కు అప్పగించే ఉద్దేశం పాక్‌కు లేదని స్పష్టమవుతోంది. 2008 నవంబరు 26న దేశ వాణిజ్య రాజధాని ముంబైలో ఉగ్రమూకలు మారణహోమం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో పాటు మరెన్నో ఉగ్రదాడుల్లో హఫీజ్ సయీద్ కీలక సూత్రధారిగా ఉన్నాడు.

భారత్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్లో ఒకడైన సయీద్‌ను... ఐక్యరాజ్య సమితి కూడా అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. అతడి తలపై అమెరికా 10 మిలియన్ డాలర్ల రివార్డ్ ప్రకటించింది. వీటితో పాటు ఉగ్ర కార్యకలాపాలకు ఆర్థిక సహకారం అందించారన్న ఆరోపణలతో మనీలాండరింగ్ కేసుల్లోనూ హఫీజ్‌పై ఎన్నో కేసులు ఉన్నాయి. ముంబై పేలుళ్ల కేసులో విచారణ నిమిత్తం అతడిని తమకు అప్పగించాలని భారత్ ఎన్నోసార్లు డిమాండ్ చేసినా పాక్ సానుకూలంగా స్పందించలేదు.

అమెరికాలో భారత సంతతి కుటుంబం అనుమానాస్పద మృతి

వాషింగ్టన్:
అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ సంపన్న కుటుంబం అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. స్థానిక కాలమానం ప్రకారం గురువారం రాత్రి మసాచుసెట్స్ రాష్ట్రంలోని వారి ఇంట్లో మృతదేహాలను గుర్తించారు. మృతులను రాకేశ్ కమల్(57), ఆయన భార్య టీనా(54), కుమార్తె అరియానా(18)గా పోలీసులు గుర్తించారు. రెండు రోజులుగా వారి నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడంతో బంధువు ఒకరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. రాకేశ్ కమల్ మృతదేహం వద్ద తుపాకీ ఉంది. దీంతో ఈ ఘటన గృహహింస వల్ల జరిగిందా లేక ఆర్థిక సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారా అని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బయటి వ్యక్తి ప్రమేయం ఉందా అనే కోణంలోనూ పరిశోధిస్తున్నారు. రాకేశ్ కమల్ దంపతులు 2016లో ఎడ్యునోవా పేరిట విద్యారంగానికి చెందిన ఓ సంస్థను ప్రారంభించారు. అయితే 2021లో దాని కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఎడ్యునోవా వెబ్‌సైట్ ప్రకారం రాకేశ్... బోస్టన్ విశ్వవిద్యాలయం, ఎంఐటీ సోలన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయాల నుంచి పట్టాలు పొందారు. ఆయనకు విద్యారంగంలో విశేష అనుభవం ఉంది. టీనా హార్వర్డ్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి.

PRINTED & PUBLISHED BY EDUPUGANTI NAGESHWARA RAO, On Behalf of VISALAANDHARA VIGANANA SAMITI, PRINTED AT AMODA PUBLICATIONS PVT. LTD, AMODA PRESS, Andhra Jyothi Buildings, S.No: 1/1 & 1/2, Near Indus High School,Gooty Road, Pandipadu Grama Panchayati, KURNOOL, ANDHRA PRADESH, PUBLISHED AT VISALAANDHRA VIGNANA SAMITI, C.R.BHAVAN, SAPTAGIRINAGAR, KURNOOL, ANDHRA PRADESH. EDITOR : R.V. RAMARAO. RNI NO:APTEL/2013/54446. Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : 08518-255522,255555, Fax No. 277721, E-Mail : visknl@ yahoo.com